2015 మే

# పరిశుద్ధత

ఆధ్యాత్మిక క్రైస్తవ మాసపత్రిక


ప్రధాన సంపాదకులు :

**రెవ.డా॥ కె. జోసఫ్**

సర్క్యులేషన్ :

**సామ్రాట్ కొడవటికంటి**


**చందా వివరములు :**

సంవత్సర చందా రూ. 150/-

పోషక చందా రూ. 1000/-

జీవిత చందా రూ. 3000/-

విడి ప్రతి రూ. 15/-


**మా చిరునామా :**

ఎడిటర్, పరిశుద్ధత

పోస్ట్‌బాక్స్ నెం. 28

ఒంగోలు - 523001

ఫోన్ : 08592-231281

సెల్ : 9704255416


## లోపలి పేజీల్లో...


సంపాదకీయం 02

ఎడిటర్

అపోస్తలుడు కొడవటికంటి 03

లియో టాల్‌స్టాయ్ ఐ.ఇ.ఆర్.యఫ్. డెస్క్ 06

వివేకముగలరాజు మామయ్య కథలు 09

ఐ.ఇ.ఆర్.యఫ్. డెస్క్

బైబిలు చరిత్ర ఐ.ఇ.ఆర్.యఫ్. డెస్క్ 11

మధ్యకాలము 15

బ్రదర్ కె. సామ్రాట్‌గారు

పౌలు జీవితము మరియు.... 18

రెవ. డా॥ కొడవటికంటి విక్రాంత్

పిలుపులు 21

శ్రీమతి రిబ్కా విక్రాంత్

అక్షరయజ్ఞం - బైబిల్ క్విజ్ 24

శ్రీమతి కె.ప్రసన్న పరాక్రమ్‌గారు


India Evangelistic & Relief Fellowship

| EVANGELISM | RELIEF |
|---|---|
| Church Planting | Orphanage |
| Evangelestic, Crusades | Child Development Centers |
| Pastor's Seminars | Education (U.C.L.I. Schools) |
| Youth Ministry | Widows & Leprosy Care |
| T.V.Ministry | Medical Assistance |
| Magazine Ministry | Help in Natural Calamity |
| Audio Ministry | Flood Relief |
| Jail & Prison Ministry | Mobile Medical Ministry |
| IERF International | Children Care Ministry |
| Hanna Women Ministries | |


**ప్రకటన రేట్లు**

| | | |
|---|---|---|
| టైటిల్ 4వ పేజీ | ..... | రూ. 3,000/- |
| టైటిల్ 3వ పేజీ | ..... | రూ. 2,000/- |
| లోపలి పేజీ | ..... | రూ. 1,000/- |

# సంపాదకీయం.....



క్రీస్తునందు ప్రియులైన పరిశుద్ధత పాఠకులకు అనుదినం దేవుని కృపాసింహాసనము దగ్గర ప్రార్ధనలో మమ్మును జ్ఞాపకం చేసుకుంటూ ఈ పత్రికను ఆదరిస్తున్న మీ అందరికీ ప్రభువైన యేసుక్రీస్తు శుభనామమున వందనములు. అప్పుడే ఎండాకాలం వచ్చేసింది. సభల హడావిడిలో కొందరు బిజీబిజీగా ఉన్నారు కదా! ఎందుకంటే ఎండాకాలం సభల సీజన్ కదా! మరి కొంతమంది వివాహ కార్యక్రమాల్లో బిజీగా ఉన్నారు. పిల్లలేమో సెలవు లిచ్చేశారు కదా సెలవుల్లో హాయిగా ఎంజాయ్ చేస్తున్నారు. ఇలా మనం ఎంత హడావిడాగా ఉన్నా, మన చుట్టూ ఉన్న ప్రపంచంలో ఏం జరుగుతుందో తెలుసుకోవడం అవసరం కదా! ఏప్రిల్ మాసం వస్తూనే కొన్ని విషాదాలను తనతో మోసుకొచ్చింది.

ఈ సంపాదకీయం రాస్తున్న సమయానికి నేపాల్ భూకంప మృతులు ఎనిమిది వేలు అని తెలియ జేస్తున్నాయి. లక్షలాదిమంది నిరాశ్రయులయ్యారు. ఇంకా ఎంతమంది చనిపోయారో కొద్దిరోజుల్లో తెలుస్తుంది. నిరాశ్రయుల కొరకు స్వచ్ఛంద సంస్థలు, వివిధ దేశాలు యుద్ధ ప్రాతిపదికన సహాయ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. అయితే విచారకరమైన కొన్ని వాస్తవాలు తెలుసుకుంటున్నప్పుడు మనసు చాలా బాధగా ఉంది. భూకంపానికి ముందు దాదాపు రెండున్నర లక్షలకు పైగా మూగ జీవాలు నేపాల్‌లో బలుల రూపంలో చంపబడ్డాయి. ఎంత విచారకరం. అంతేకాదు ఒక దైవసేవకుణ్ణి మంటపెట్టి చంపివేశారు. నేపాల్లో విగ్రహారాధన చాలా ఎక్కువ. విగ్రహారాధన పేరుతో జరిగే హింసాత్మక కార్యక్రమాలు కూడా ఎక్కువే. దేవుని బిడ్డలకు అన్యాయం జరుగుతున్నపుడు దేవుడు మౌనంగా ఉండడు. స్తెఫను రాళ్ళతో కొట్టబడుచున్నప్పుడు ఒక దర్శనాన్ని చూశాడు. అదేమంటే "మనుష్య కుమారుడు దేవుని కుడిపార్శ్వమందు నిలిచియుండుట" బైబిల్లో ఈ ఒక్కచోట మాత్రమే "నిలిచియుండుట" అను పదము యేసుక్రీస్తుకు వాడబడింది. ఆయన ఎందుకు నిలిచియున్నాడు? అనే ప్రశ్నకు భక్తులు మంచి సమాధానాన్ని చెప్పారు. ఆయన బిడ్డలు బాధపడుతున్నప్పుడు దేవుడు పరలోకంలో మౌనంగా ఉండడు. తన స్థానం నుండి లేచి ఆయన చూస్తూ ఉంటాడన్న భావన మనకు ఎంతో ఆదరణ కలిగిస్తుంది. నేపాల్లో జరుగుతున్న సంఘటనలు, నేపాలుకు జరిగిన నష్టాలకు మనం దేవుని సన్నిధిలో వారిందరినీ జ్ఞాపకంచేసుకుందాం. దేవుడు త్వరలో నేపాల్‌ను పునర్నిర్మాణం చేయడానికి సహాయం చేస్తాడు.

**...మిగతా 20వ పేజిలో**

సీరియల్

# అపొస్తలుడు

14

– కొడవటికంటి

తనని తాను అణచుకొంటూ – కయప అటు ఇటు నడిచాడు. ఆయనకి ఏదో గుర్తుకు వచ్చింది. అప్పుడు ముఖం వికారంగా మారింది. అది ఇతరులు చూడటం ఇష్టం లేనట్లుగా ముఖం అటుగా త్రిప్పుకొని కూర్చున్నాడు. ఏమి చెయ్యటానికి తోచక, మాటలు చాలక మౌనంగా ఉండి పోయాడు.

"చెప్పండి? మీ సలహా కోసమే వచ్చాను" అన్నట్లుగా సౌలు కొంచెం ముందుకు వంగాడు.

"గలలియ నుండి యెరూషలేముకు చేపలు సరఫరా చేసే యువకుడు ఒకడు ఉన్నాడు. చాలా స్థితిమంతుడు! బెస్త వాడైనా, యెరూషలేములో కూడా అతనికి ఆస్థి వుంది. వయస్సు చిన్నదైనా, అనుభవం ఎక్కువ. రోమీయులలో సహస్రాధిపతులతో కూడ సంబంధాలు ఉన్నాయి. వ్యాపారం అటువంటిది అయినా చదువు లేదు. గలలియుల యాస భాష మాట్లాడతాడు. చిన్నవాడై నందున అందరూ ప్రేమించారు. అన్నాగారు కూడ ప్రేమగా చూసేవారు. అతని పేరు యోహాను. జబదయి అనే ధనవంతుని కుమారుడు.

యెరూషలేము వచ్చి వ్యాపారం చేసుకొంటూ బాప్తీస్మకుడైన యోహాను శిష్యుడిగా చేరాడు. తర్వాత కొంతకాలానికి నజరేయుని దగ్గర చేరాడు. యోహాను చనిపోయిన తర్వాత తన అన్న యాకోబుతో కలసి, వ్యాపారం తండ్రికి, పనివారికి అప్పజెప్పి యేసుతో తిరగటం మొదలుపెట్టాడు. చాలా అమాయకంగా, లేతగా ఉండేవాడు. కాని నజరేయుణ్ణి సిలువవేసిన యాభై రోజులకు యేసు శిష్యులందరూ కలసి, 'చనిపోయిన యేసు తిరిగి లేచాడు' అని ప్రచారం చెయ్యటం మొదలుపెట్టారు. అంతేకాక రోమీయులు సిలువ వేసిన యేసును మేము చంపించామని ప్రజలలో ప్రచారం చేస్తుంటే దేవాలయంలో బంట్రౌతులు అదుపులోకి తీసుకొని చెరసాలలో ఉంచారు. కాని చెరసాలలో కాపలావారు వీరితో లాలూచీపడి విడిపించారు.

మరలా సభను ఏర్పాటు చేసి వారిని పిలిపించాము. 'మీరు యేసు నామమును బట్టి ఎంత మాత్రమును మాటలాడకూడదు, బోధింపకూడదని వారికాజ్ఞాపిస్తే....." అని ఆగాడు. తలవంచుకొని జాగ్రత్తగా వింటున్న సౌలు చటుకున్న తల ఎత్తి ప్రధానయాజకుని చూచాడు. "వారికి ఆజ్ఞాపిస్తే వారు ఏమన్నారో తెలుసా?" అని సౌలు ముఖంలోకి చూస్తూ "దేవుని మాట వినుటకంటే, మీ మాట వినుట దేవుని దృష్టికి న్యాయమా? మీరే చెప్పండి. మేము కన్నవాటిని విన్నవాటిని చెప్పకయుండలేము అన్నారు" అన్నాడు కయప.

"అప్పుడు సభవారు ఏమి చేసారు?" అడిగాడు సౌలు.

"ఏమి చెయ్యలేదు. వారిని గట్టిగా బెదిరించి పంపివేశారు" అన్నాడు కయప.

"ఎందుకని ఆ బలహీనులైన గలలీయులకు సభ భయ పడుతుంది?" అని తనలో తాను అనుకున్నట్లుగా పైకి అన్నాడు సౌలు.

"సభ అంటే ఒక వ్యక్తి కాదు కదా! అదీకాకుండా గమలియేలు గారు అడ్డం వచ్చారు. కాకుంటే ఆ రోజే వారిని చంపి వేసి ఉండేవాళ్ళం. ఇప్పుడు జరుగుచున్న పరిస్థితులలో సభ ఏమీ చెయ్యలేదు. కాని 'ఎవరైనా' దేవుని కొరకు సమర్పించుకొనిన వారు వీరిని సమూహంగా నాశనం చేస్తే, సభ అప్పుడు వారికి అండగా ఉంటుంది" అన్నాడు కయప.

ఏ దారిలేని ప్రదేశములో, ఒక కాలిబాటలాంటిది కనబడుతుంది అనుకునే సౌలు – ఒక్కసారి గాలి గట్టిగా వదిలాడు. ముఖం మీద నరాలన్ని ఒక్కసారి వదులైనట్లుగా అనిపించింది. ఎక్కడిదక్కడ ఆగిపోయిన తన శరీరంలోని రక్తం మరలా ప్రవహించడం మొదలయినట్లైంది.

దేవుడు తనకిచ్చిన ఈ అవకాశం వదులుకోకూడదు అనుకున్నాడు. కయపగారు అందించిన ద్రాక్షరసం పుచ్చు కుంటూ ఆలోచిస్తున్నాడు. ఈ రెండో గ్లాసు పూర్తి అయ్యేసరికి శరీరంలోని నీరసం పోయింది. మెదడు పనిచెయ్యటం

ప్రారంభించింది.

కయపగారు కూడ ఆలోచిస్తూ కొంచెంసేపయిన తర్వాత "ఇప్పట్లో మీరు ఏమి చెయ్యాలనుకొంటున్నారు?" అన్నాడు.

"యేసు నామమునకు విరోధముగా అనేక యోచనలు ఉన్నవి. ముందు ఏది ప్రారంభించాలో, ఏది దేవుని చిత్తమో అని ఆలోచిస్తున్నాను" అన్నాడు.

కయప సంతోషంతో లేచి నిలుచున్నాడు. సౌలు కూడ నిలుచున్నాడు. కయప ప్రేమగా సౌలు భుజము మీద చెయ్యివేసి "సాయంకాలం అన్నాగారితో మాట్లాడతాను. మీరు ప్రతిరోజు వీలు చూచుకొని రండి. మీ కోసం చూస్తుంటాను" అన్నాడు....

సౌలు కెద్రోగు వాగు దాటి ఒలీవల కొండ మీదుగా వచ్చి ఒలీవల చెట్టుక్రింద కూర్చొని యెరూషలేము పట్టణాన్ని చూస్తున్నారు. సీయోను కొండ మీద ఉన్న యాజకుని ఇంటి పైభాగము, పూర్వం మిల్లోకోటగా ఉన్నప్పుడు ఈ పట్టణం ఇంకెంతో అందంగా ఉండేది.

ఎడమ ప్రక్కగా యెరికో రహదారి మీదుగా వస్తున్న యాత్రికులను చూస్తూ తరతరాలుగా ఎన్ని వందలసంవత్స రాలుగా యాత్రికులు ఈ రహదారి మీదుగా యెరూషలేము వచ్చినా, నేడు యేసు వలన మైలపడిపోయిన ఈ యెరూష లేము క్రొత్తగా అనిపిస్తుంది అనుకున్నాడు.

సాయంకాలం మూడు గంటల కావస్తుంది. ఆకలిగా లేదు. సంతోషంగా లేకపోయినా, కయపగారితో మాట్లాడి నందువలన దుఃఖం లేకుండా పోయింది.

సూర్యుడు ఎదురుగా ఉన్నాడు. సూర్యుడు అస్తమించ డానికి పరిగెత్తుతుంటే సౌలు చిన్నగా కెద్రోను వాగులోకి దిగి గమలియేలు గారి ఆస్థానం వైపు నడుస్తూ ఉన్నాడు.

దాదాపు నెలరోజులు, రోజూ ఏదో ఒక చోట, ఏదో ఒక సందర్భంలో యేసును గూర్చిన చర్చ వింటూనే ఉన్నాడు. మొదట్లో ప్రతిరోజు కయపగారిని కలుస్తుండేవాడు. కాని ఇప్పుడు చాలా అరుదుగా కలుస్తున్నాడు. గమలియేలుగారిని కలవటం అసలు పూర్తిగా ముగిసిపోయింది.

పెంతెకోస్తు పండుగ ముగిసిపోయింది. మరలా యెరూషలేము మామూలు స్థితిలోకి వస్తుంది. ఇంకా కొంతమంది యాత్రికులు యెరూషలేములో ఉన్నారు.

ఒక రోజు మధ్యాహ్నం తను ఇంట్లో ఉండగా ప్రధాన యాజకుని బంట్రౌతు – సభ అత్యవసర సమావేశానికి పిలిచి వెళ్ళాడు. అయితే ఎందు కోసం ఈ సమావేశమో తెలియలేదు. దేవాలయ ప్రాంగణం వద్దకు వచ్చేటప్పటికి జనం గుంపులు గుంపులుగా యాజకుని నివాసంవైపు నడుస్తున్నారు. యాజకుని ఇంటి వసారాలో చాలామంది జనం. కొంత మంది సభ్యులు ఆసీనులై ఉన్నారు.

సౌలు వెళ్ళి ఒక ఆసనం మీద కూర్చున్నాడు. మధ్యలో నిలువబెట్టిన ముద్దాయి మౌనంగా ఉన్నాడు. అతని ముఖం చూస్తే ఇంతకు ముందు ఎక్కడో చూచినట్లుగా అనిపించింది. సౌలు ఆలోచిస్తున్నాడు. మొత్తానికి అతను తనకు తెలుసు, అతనితో మాట్లాడి ఉండాలి. లేకుంటే ఇంత పరిచయం ఉన్న ముఖం ఎలాగ అవుతుంది? అనుకున్నాడు.

సౌలు ప్రక్కన ఉన్న వ్యక్తిని చూసి "అతనిది ఏ ఊరు? ఎందుకు తీసుకొని వచ్చారు?" అన్నాడు.

"నజరేయుని శిష్యుడు – గ్రీకు భాష మాట్లాడే యూదుడు. లిబర్తీయుడైన వాడు" అని చెప్పాడు.

అప్పుడు గుర్తుకు వచ్చింది. బర్నబాతో కలిసి వచ్చిన వ్యక్తే అతను ప్రధాన యాజకుడు ఇంకా తన ఆసనం మీదకి రాలేదు.

"ఇతనిమీద దేవదూషణ నేరం నమోదు చేసారు" అన్నాడు ప్రక్కన కూర్చున్న సభ్యుడు.

"యేసు శిష్యులందరు దేవదూషకులే కదా!" అన్నాడు సౌలు.

ఇంతలో గంట మ్రోగింది. కయప తన సమావేశపు దుస్తులతో లోనికి వస్తుంటే సభికులందరు లేచి నిలుచున్నారు. ఆయనతో పాటు అందరూ కూర్చున్నారు.

సభలో ఎడమవైపు చివరన కూర్చున్న శాస్త్రి తన చేతిలోని కాగితాలు ఎడమ చేత్తో పట్టుకొని కయపగారి ఆసనం ఎదురుగా నిలబడి కొద్దిగా వంగి నమస్కారం చేసి, అక్కడ కూడిన వారందరి వైపు ఒకసారి చూసి "ఈ మనుష్య

డెప్పుడూ ఈ స్థలముకు విరోధముగా మాట్లాడుతున్నాడు" అప్పుడప్పుడు, అందరు స్తెఫన్ వైపుగా చూసారు. సౌలు కూడా అతని ముఖం సాదరంగా చూచి అలాగే చూస్తుండి పోయాడు.

ఏదో ఒక అద్భుతం తన కండ్లముందే జరుగుతోంది అనిపించింది. ఒక్క నిమిషం ముందు తను చూచిన స్తెఫను ముఖం, ఇప్పుడు చూస్తున్న ముఖం అసలు పోలికలు ఏమి లేదు. ఏదో దివ్యకాంతి అతని శరీరంలో నుండి బయలుదేరి అతని కండ్లలోనుండి బయటకు వస్తున్నట్లుగా కనిపిస్తుంది. అతని వస్త్రములు కూడ మెరుపులాగా మెరుస్తున్నాయి.

మరలా శాస్త్రి "ఈ నజరేయుడైన యేసు – ఈ చోటును పాడు చేసి, మోషే మనకిచ్చిన ఆచారాలను మార్చునని వీడు చెప్పగా" అని స్తెఫను వైపుకు చూపించినప్పుడు సౌలు మరలా స్తెఫన్ వైపుకు చూచినపుడు అతని ముఖం మామూలుగానే ఉంది.

సౌలు ఆలోచనలో పడ్డాడు. స్తెఫనులో క్షణంసేపు అతను చూచిన మార్పు. అది యధార్ధమైన మార్పు – అది ఎలాగ జరిగింది? ఔను! అతని ముఖం దేవదూత ముఖం వలే కనిపించింది.

తనకు ఇప్పుడు 35వ సంవత్సరము నడుస్తుంది. తనకు ఇంత వరకు దృష్టి లోపం కొంచెమైనా రాలేదు. మరి స్తెఫను ముఖం ఎందుకు మారింది?

ప్రక్కన కూర్చున్న సభ్యుడు సౌలును తొడమీద తాకాడు పిలుస్తున్నట్లుగా – సౌలు అతనివైపు ప్రశ్నార్థకంగా చూసాడు.

"అతని ముఖం చూడండి. దేవదూత ముఖంలాగ ప్రకాశిస్తుంది" అన్నాడు. సౌలు అదిరిపడ్డాడు. అయితే తనకు కలిగినది భ్రమ కాదు – ఇది నిజమైన రూపాంతరం.

ఈ బాహ్యమార్పు అతని మీద దేవుని శిక్ష రావటానికా? లేక అతని అంతర్గత స్వరూపము బయటకు తీసికొని రావటమా?

తర్వాత ఇద్దరు సాక్ష్యుల పేర్లు బంట్రౌతు పిలుస్తుంటే వారు మధ్యలోకి వచ్చి శాస్త్రిగారు చదివిన సంగతికి తాము సాక్ష్యులమని ప్రమాణం చేసారు. అప్పుడు ప్రధానయాజకుడు "ఈ మాటలు నిజమేనా?" అన్నాడు.

అప్పుడు స్తెఫను "సహోదరులారా! తండ్రులారా! " అని మొదలు పెట్టినపుడు, అది ప్రసంగ భాషలాగ లేదుకాని యదార్థంగా హృదయంలో నుండి పొంగుతున్న ప్రేమభావన లాగ తోచింది.

అబ్రహామును దేవుడు పిలచినప్పటి నుండి మొదలైన ప్రసంగం సొలొమోను దేవాలయం – అలా మాట్లాడుతున్నంత సేపు సౌలు తల వంచుకొని కొంచెంసేపు కండ్లు మూసుకొని వింటున్నాడు. స్తెఫను చరిత్ర చెబుతున్నాడు. ఇంతచక్కగా, వేదాంతం చదివిన పరిసయ్యులైనా చెప్పగలరా? అను కొంటున్నాడు.

"ఆకాశము నా సింహాసనము.... భూమి నా పాదపీఠము. మీరు నాకొరకు ఎలాంటి మందిరము కట్టుదురు. నా విశ్రాంతి స్థలమేది? ఇవన్నియు నా హస్తకృతములు కావా? అని ప్రభువు చెబుతున్నాడు అని ప్రవక్త పలికిన ప్రకారం సర్వోన్నతుడు హస్తకృత్యాలయములో నివసింపడు" అని చెబుతుంటే కండ్లు మూసుకొని వింటున్న సౌలు కంట్లో నిర్మలమైన ఆకాశము, హెర్మోను కొండమీద నిలిచిన తెల్లని మేఘాలు కనిపించాయి.

స్తెఫను చెప్పిన మాటలు ఎక్కడికి వెళ్తున్నాయి. ఈ మాటలనుండి ఏ సభ వారైనా అతనికి శిక్ష విధించగలరా?

"హెబ్రీయుల యొక్క చరిత్ర, విశ్వాసపూరితమైనది. సర్వోన్నతుడు హస్తకృత్యాలయములో నివసించడు" స్తెఫను ఆగిపోయాడు.

సౌలు తలఎత్తి అతని ముఖం చూసాడు. అప్పటిదాకా తండ్రుల తోటి, సోదరులతోటి ఎంతో ప్రేమగా మాట్లాడు తున్న అతని ముఖం మారిపోతుంది. **(సశేషం)**

Read Our Internet Edition @
**www.holinessmagazine.com**

సీరియల్

# ఫాదర్ సర్గీస్

## (లియో టాల్‌స్టాయ్)



అది చలికాలం – రాత్రిపూట. ఫాదర్ నీళ్ళు తెచ్చు కోవడానికి బయటకు వస్తే ఆ తల్లి పాలిపోయిన తన బిడ్డతో అక్కడే కూర్చుని ఉన్నది. యేసు ధనవంతుడైన ఓ న్యాయాధిపతి ఓ పేద విధవరాలికి న్యాయము తీర్చకుండిన ఉపమానము గుర్తుకు వచ్చింది. గదిలోకి వెళ్ళి చాలాసేపు ప్రార్థన చేసుకున్నాడు. తన మనస్సు స్థిరమైన స్థితికి వచ్చే వరకు ప్రార్థన చేశాడు. ఇక లేచి బయటకు వెళ్ళి ఆమె కుమారుని తలమీద చేయి ఉంచాడు. ఆమె వెళ్ళిపోయింది. ఒక నెల తర్వాత ఆ బిడ్డ స్వస్థత పొందాడు. ఇప్పుడు ఫాదర్ సర్గీస్‌ని స్టారెట్ సర్గీస్ అని పిలువసాగారు. అతని గురించిన వార్త ఆ జిల్లా అంతటా స్వస్థపరిచే శక్తి గలవానిగా తెలియబడింది. వారం తిరుగకముందే జనం గుంపులు గుంపులుగా ఆయన యొద్దకు రాసాగారు.

ఇప్పటికి సర్గీస్ అక్కడ పదమూడు సంవత్సరాల నుండి జీవిస్తున్నాడు. సర్గీస్ వయస్సు మళ్ళిన వాడయ్యాడు. అతని గడ్డం పొడవుగా తెల్లగా మారింది. కాని తల వెంట్రుకలు పలుచగా ఉన్నప్పటికి నల్లగానే ఉన్నాయి. ఇప్పుడు సర్గీస్ ఆలోచనలోపడ్డాడు. తను చేస్తున్న పని సరైనదా? తనకంటే ఉన్నతమైన వారికి లేని కీర్తి తను పొందవచ్చునా? ఆ పద్నాలుగు సంవత్సరాల బాలుని స్వస్థత తర్వాతనే తనకి ఈ పరిస్థితి వచ్చింది. ఇప్పుడు రోజులు, నెలలు, సంవత్సరాలు దొర్లిపోతున్నాయి.

ఇప్పుడు తనకు ఖరీదైన కానుకలు వస్తున్నాయి. పెద్ద పెద్ద పేరున్నవారు తనను చూడ వస్తున్నారు. మత పెద్దలు వచ్చారు. అతనికి వచ్చే కానుకలను పద్ధతి ప్రకారం పెట్టారు. తన సొంత పనులు ఏవీ చేసుకోనివ్వడంలేదు. సర్గీస్ ప్రజలకు దీవెనలు ఇవ్వడం మాత్రమే! అతనికి వచ్చే కానుకలను తిరస్కరించకూడదు. రిసెప్షన్ రూం ఒకటి తయారుచేశారు. పొడవాటి కడ్డీలు నిలబెట్టి సర్గీస్ మీద ప్రజలు గుమికూడకుండా కట్టుదిట్టం చేశారు.

నీవు ప్రజల కొరకు ఉన్నావు. యేసుప్రభువు ఎవరిని త్రోసి వెయ్యలేదు. నీకొరకు వచ్చేవారిని చూడకుండా ఉండడము దుర్మార్గమవు తుంది. ఇప్పుడు పెద్ద గురువుల మాటప్రకారం నడుచుకుంటుంటే తన లోపలి జీవజలము తరిగిపోయింది. ఇప్పుడు అతని జీవితమంతా మనుష్యులతో గడపడమే కనుక దేవునితో సహవాసం తగ్గిపోయింది. నేను దేవుని కొరకు పనిచేస్తున్నానా? మనుష్యులను సంతోషపరచడానికి జీవిస్తున్నానా? అని ఆలోచించనారంభించాడు. తనను దేవుని నుండి దూరపరచడానికి సాతాను ఈ పద్ధతులు ప్రారంభించాడు అని అనుకున్నాడు. ఇంతకుముందు తను దేవునితో ఎక్కువ కాలం గడిపేవాడు.

కొంతకాలము తర్వాత ఇక్కడనుండి ఎటైనా పారిపోవాలని తలంపు కలిగింది. అలా వెళ్ళిపోవడానికి పద్ధతులు ఆలోచించసాగాడు. ఒక రైతు ధరించే వస్త్రాలు, టోపి సంపాదించాడు. మొదట రైలులో మూడు వందల మైళ్ళు ప్రయాణం చేసి తర్వాత గ్రామ గ్రామాలు నడిచివెళ్ళాలి. ముందు తలవెంట్రుకలు కత్తిరించుకోవాలి. తనకు తెలిసిన ఓ సిపాయిని చాలా విషయాలు అడిగి తెలుసుకున్నాడు. తన ప్రయాణం ఏ దిక్కుగా వెళ్తే మంచిది? ఇక్కడే ఉండాలా? తప్పించుకొని వెళ్ళిపోవాలా? అని ఆలోచించడం మొదలు పెట్టాడు. ఒకరోజు జనం విపరీతముగా వచ్చారు. సర్గీస్ వారందరిమీద చేతులుంచుతూ నడుస్తున్నాడు. చాలా అలిసిపోయినట్లుగా ఉన్నాడు. కొంచెం సేపటికి ప్రక్కనున్న కడ్డీలమీద పడబోయాడు. అక్కడున్న ఓ వ్యాపారి సర్గీస్‌ని పట్టుకొని నిలబెట్టాడు. అతనికి తోడుగా ఓ స్త్రీ వచ్చింది. సర్గీస్ దూరంగా ఓ చెట్టు క్రింద బెంచిమీద కూర్చున్నాడు.

జనం అక్కడికి పరుగెత్తుతూ వచ్చి మూగారు. ఆ వ్యాపారి అరుస్తూ అందరిని బయటకు పంపిస్తున్నాడు.

ఈ వ్యాపారి భార్య నాలుగు సంవత్సరాల క్రితం చనిపోయింది. ఒక కుమార్తె. ఆమెకు మానసిక రుగ్మత. ఎన్నో హాస్పిటల్స్‌కి తీసుకొని వెళ్ళాడు. ఎన్నో మందిరాలకు తీసుకొని వెళ్ళాడు. కాని బాగుపడలేదు. చివరికి సర్గీస్ వద్దకు వచ్చాడు. కాని సర్గీస్ ప్రజల మధ్యలో మునిగి ఉన్నాడు. ఎలాగైనా సర్గీస్ దగ్గర మాట తీసుకొని తన కుమార్తెను ఇక్కడికి తీసుకొని రావాలనుకున్నాడు.

ఒకరోజు – "ఫాదర్! నా కుమార్తెను స్వస్థపరచండి మీ పాదాల వద్ద పడి ఉంటాను" అన్నాడు.

"ఆమె చాలా బలహీనముగా ఉన్నదా?" అన్నాడు సర్గీస్.

"లేదు, ఆమె ఆకారము అంతా ఆరోగ్యంగా ఉంటుంది. డాక్టర్లు ఆమె మానసిక రోగి అన్నారు. ఆమె తల్లి చనిపోయిన తర్వాత ఆమె ఆలా అయింది" అని సర్గీస్ కాళ్ళు పట్టుకున్నాడు.

"ఇప్పుడు చాలా నీరసంగా అలిసివున్నాను. నీ కుమార్తెను సాయంకాలం తీసుకొనిరా!" అని తన గదిలోకి వెళ్ళాడు. మోకరించి ప్రార్ధన చెయ్యడం మొదలుపెట్టాడు. స్వస్థతలు తన జీవితంలో తనకు నెమ్మది లేకుండా చేసి ఆత్మీయంగా తన అస్వస్థతకు కారణమయ్యాయి. ప్రార్ధన చేయసాగాడు. "యేసుప్రభువా! దైవకుమారుడా! నామీద దయ చూపు. నన్ను కాపాడు" అని ప్రార్థించాడు. అరగంట తర్వాత లేచి ఆ వ్యాపారి కొరకు చూశాడు.

ఆ వ్యాపారి కూతురు యొక్క స్వస్థత జరుగుతుంది. ఆమె ఇప్పుడు తన మనసులో మెదలడం ఎందుకు? అనుకున్నాడు. ఇప్పుడు తన జీవితం చక్రవర్తికి కూడా తెలిసిపోయి ఉంటుంది అనుకున్నాడు. మరలా ఈ లోక సంబంధమైన ఆలోచనలన్ని వచ్చినందున బాధపడుతూ లోనికి వచ్చి ప్రార్థించాడు. "పరలోకపు తండ్రి నా హృదయంలో ప్రకాశించు. ఈలోకపు మనుష్యులనుండి దూరము చెయ్యి". తన ప్రార్ధనలు ఇతరులకు స్వస్థత కలుగచేస్తున్నాయి. కాని తన హృదయానికి పూర్తి స్వస్థత ఎప్పుడు వస్తుంది? ఒకప్పుడు తన హృదయశుద్ధి కొరకు తన చేతివ్రేలినే బలి చేశాడు. తన చేతిని పైకెత్తి తెగిపోయిన వేలిని ముద్దు పెట్టుకున్నాడు.

వ్యాపారి కుమార్తె ఇరవై రెండు సంవత్సరాల వయస్సు ఉన్నది. ఆమె స్త్రీతత్వము కలిగివున్నదా? అందంగా ఉంటుందా? ఇదేంటి నేను ఇంత దిగజారి పోయాను? మళ్ళీ రెండు చేతులతో ముఖం కప్పుకొని "ప్రభువా! నన్ను కరుణించు" అని ప్రార్థించాడు. ఇంతలో వ్యాపారి వచ్చాడు. ఒక చేత్తో తన కుమార్తెను పట్టుకొని లోనికి తీసుకొని వచ్చి వదిలి వెళ్ళిపోయాడు. ఆ అమ్మాయి అందంగా ఉంది. చాలా చిన్నపిల్ల వంటి చూపు. ఆమె ఓ బెంచిమీద కూర్చున్నది. అందంగా కూర్చున్నది.

"నేను మానాన్న దగ్గరికి వెళ్తాను" అన్నది.

"భయపడవద్దు, నీ కష్టం ఏమిటి?" అన్నాడు.

"నా శరీరమంతా బాధగా ఉంది" అని సర్గీస్ వైపు చూస్తూ నవ్వింది.

"నీకు స్వస్థత వస్తుంది ప్రార్థించు" అన్నాడు.

"నేను చాలాకాలంగా ప్రార్థిస్తున్నాను. కాని ఏమి లాభం?" అన్నది. "మీరు నా తలమీద చెయ్యి ఉంచి ప్రార్థించండి. నేను మిమ్మల్ని నా కలలో చూశాను" అన్నది.

"నీవు నన్నెలా చూశావు?" అన్నాడు.

"మీరు మీ చెయ్యిని ఇక్కడపెట్టి ప్రార్థించినట్లుగా చూశాను" అని సర్గీస్ చెయ్యిని తీసుకొని తన ఎదపై పెట్టి వత్తింది. "ఇక్కడే" అన్నది.

"నీపేరు ఏమిటి?" అన్నాడు వణుకుతున్న స్వరముతో. ఇప్పటికే అతని శరీరమంతా కోరికతో పొంగి పోతున్నది.

"మారియా నా పేరు. ఎందుకు?" అన్నది. అతని చేతిని తీసుకొని ముద్దుపెట్టుకొని మరో చేతితో అతని నడుము మీద చేయివేసి దగ్గరగా లాగి తన శరీరానికి అదుముకున్నది.

"మారియా! ఏమి చేస్తున్నావు? సైతాన్!" అన్నాడు.

"ఇప్పుడేమయింది?" అని అతనిని దగ్గరగా లాగుతూ మంచం మీద కూర్చున్నది.

అతను కోపంగా లేచి "ఇదంతా ఏమిటి? నాచేతి వేళ్ళు మళ్ళీ నరుక్కోవాలా?" అనుకుంటూ గొడ్డలి పట్టుకొని ప్రక్కకు వచ్చాడు. పనివాడు లోనికి వచ్చి "అయ్యా కట్టెలు కొట్టాలా?" అన్నాడు.

"అవసరములేదు" అని తన గదిలోకి వెళ్ళాడు. ఆ అమ్మాయి తన పడకమీద పండుకొని నిద్రిస్తున్నది. తను దాచి ఉంచిన రైతు వస్త్రాలు బయటకు తీశాడు. ప్రక్కన ఉన్న కత్తెరతీసి తన పొడవైన తలవెంట్రుకలు కత్తిరించి రైతు గుడ్డలు ధరించి వెనుక వైపు గుండా బయటకు వచ్చాడు. తలమీద టోపి పెట్టుకొన్నాడు. నది ప్రక్కగా నడుస్తున్నాడు. మధ్యాహ్నం ఎండగా ఉంది. పంట చేలలో పండుకున్నాడు.

తెల్లవారింది. సూర్యుడు ఇంకా లేవలేదు. చనిపోవాలనుకున్నాడు. ఈ నదిలో దూకితే? తనకు ఈత వచ్చు, చావడు. ఉరివేసుకుంటే? భయంవేసింది. ప్రార్థించాలనుకున్నాడు. ప్రార్థించడానికి ఎవరూ లేరుగా? మరలా పండుకున్నాడు. నిద్రపోవాలనుకున్నాడు. నిద్రరాదు. ఆలోచించాలి అనుకొని పండుకొని చేతిమీద తల ఆన్చి ఆలోచిస్తున్నాడు.

తల్లి ఒడిలో పండుకొనిన చిన్న పిల్లవాడ్ని తనలో చూసుకున్నాడు. తర్వాత తను ప్రేమించిన అమ్మాయి గుర్తుకు వచ్చింది. ఇప్పుడేమి చేస్తుంది? ఇంకా దూరములో ఉన్నదా? ఆమెను తన జ్ఞాపకంలో నుండి తుడిచివేశా ననుకున్నాడు. కాని ఆమె వెళ్ళలేదు. ఆమె గురించి ఎందుకు ఆలోచించాలి? నా జీవితాన్ని ముగిస్తే మంచిది అనుకున్నాడు. నిద్రపోయాడు. నిద్రలో ఓ దేవదూత వచ్చాడు. "నీవు ప్రశాంక వద్దకు (తన మొదటి ప్రేయసి) వెళ్ళు. నీవేమి చెయ్యాలో నీకు చెబుతుంది. నీ పాపమేమిటో ఆమె చెబుతుంది. నీకు రక్షణ ఎక్కడనుండి వస్తుందో.." అని చెప్పాడు.

సర్గీస్ లేచాడు. ప్రశాంక దగ్గరకు వెళ్ళటానికి నిశ్చయించుకున్నాడు. ఆమె ఇక్కడికి 200 మైళ్ళ దూరములో ఉన్నది. నడక ప్రారంభించాడు. వారం తర్వాత ప్రశాంక ఇంటి తలుపు తట్టాడు. ఓ యవ్వనస్తురాలు తలుపు తీసింది. "ప్రశాంకను పిలుస్తారా?" అన్నాడు.

ఆ అమ్మాయి తన అమ్మమ్మ ప్రశాంక వద్దకు వెళ్ళి "అమ్మమ్మా! చాలా ముసలాయన నీ కొరకు వచ్చాడు" అన్నది.

ప్రశాంక కిటికీలోనుండి చూసింది. "ఎవరో బాటసారి" అనుకొని తన చేతిలో ఓ రొట్టె, కొంచెం చిల్లర పట్టుకొని బయటకు వచ్చింది. సర్గీస్‌ను గుర్తుపట్టలేదు. సర్గీస్ ఆమె చేతిలో నుండి రొట్టెను డబ్బులు తీసుకొని అలానే నిలబడ్డాడు.

"అయ్యా! ఏమీ అనుకోవద్దు. నా దగ్గర ఇక ఏమీ లేవు" అన్నది. ఆమె కండ్లలోకి చూస్తూ "ప్రశాంక! నేను నీ కొరకు వచ్చాను" అన్నాడు.

ఆమె ఆశ్చర్యపోయి కండ్లు నీళ్ళతో నిండిన ఆ సర్గీస్‌ని తేరిచూసి "స్టెపా.. సర్గీస్!" అని అరిచింది.

సర్గీస్ తల ఊపుతూ.. "నేను ఫాదర్‌ని కాదు. పాపిని. నన్ను క్షమించు, లోనికి రానియ్! నాకు సాయం చెయ్యి" అన్నాడు లోనికి నడుస్తూ.

"ఇది అసాధ్యము, రండి" అని చేయి అందించింది.

కాని అతను ఆ చేతిని అందుకోకుండా లోనికి వచ్చాడు.

పక్కన ఉన్న బెంచిమీద కూర్చుంటూ "నన్ను గురించి ఇప్పటికి నీకు తప్ప మరెవరికి తెలియదు" అంటూ కాలి బూట్లు తీసి ప్రక్కన పెట్టి బెంచిమీద పండుకున్నాడు. ముప్పయి మైళ్ళు ఏకధాటిగా నడిచివచ్చాడు. నిద్రమేలుకున్న తర్వాత "ప్రశాంక! నేను ఇప్పుడు ఫాదర్‌ని కాను, క్రీస్తును కాను పాపిని" అన్నాడు.

ప్రశాంక ప్రశాంతంగా అతని చూసింది. "మీరు అనవసరంగా బాధపడుతున్నారు" అన్నది.

"లేదు ప్రశాంక! నేను వ్యభిచారిని. దొంగను, హంతకుడిని" అన్నాడు.

"ఓ దేవుడా! అది ఎలా?" అన్నది ఆశ్చర్యంతో.

"ఎలా బోధించాలో ఇతరులకు బోధించాను. కాని నేను బోధించినవి ఏవీ నేను ఆచరించలేదు. నిజానికి నాకేమి తెలియదు. నువ్వు నాకు బోధించు" అన్నాడు.

"నన్నెందుకు ఎగతాళి చేస్తారు? మీరెప్పుడు నన్ను నీచంగా చూస్తారు" అన్నది.

**(సశేషం)**

చిన్నపిల్లల పేజి

# వివేకముగల రాజు




చాలా కాలం క్రితం ఒక చాలా చాలా జ్ఞానంగల రాజు ఉండేవాడు. ఆ రాజుకి ఎంత జ్ఞానం ఉందంటే అతను ఏ విషయమైన తెలుసుకోగలడు. అతనికి పక్షుల గురించి, జంతువుల గూర్చి చేపల గూర్చి అలాగే చెట్లను గూర్చి కూడా తెలుసు. ఈ రాజు వీటన్నిటి గూర్చి రాజ్యంలోని ప్రజలందరికి తెలియజేస్తుంటాడు.

ఒకసారి ఒక చల్లగాలి వీచేవేళ ఒక చిన్న తేనెటీగ దారి తప్పి ఆ అందమైన రాజభవనంలోనికి ప్రవేశించింది. అప్పుడు ఆ తేనెటీగ రాజుగారిని బతిమాలుకుంటుంది. రాజుగారు నన్ను ఏమి చేయవద్దు. నన్ను ఈ రోజు బ్రతకనియ్యండి అప్పుడు తరువాత మీకు ఎప్పుడైన సహాయం కావాలంటే నేను మీకు సహాయం చేస్తాను.

అప్పుడు ఆ రాజుకి నవ్వు వచ్చింది ఇంత చిన్న తేనెటీగ ఇంత గొప్ప రాజునైన నాకు సహాయం చేస్తుందా. ఆ రాజు ఆ తేనెటీగను వదిలేసి "వెళ్లిపో నాకు ఈ రోజుకు నీ నుండి ఎలాంటి అవసరం లేదు". అన్నాడు.

చాలా రోజుల తరువాత ఒకరోజు రాజభవనం అంతా జనంతో నిండిపోయింది. ఎందుకంటే చాలా దూరం నుండి ఒక రాణి రాబోతుంది అందుకు. ఆమె ఈ రాజుగారి యొక్క జ్ఞానం గూర్చి అందరు చెప్పుకోవటం వినింది. ఇప్పుడు తనంతట తానుగా తెలుసుకోవాలని వస్తుంది. చివరికి ఆమె రాజుగారి సింహాసనం దగ్గరికి వచ్చింది. వచ్చిన వెంటనే రాజుకి కానుకలు అందించి తను ఎందు కొచ్చిందో ఆ కారణం తెలియజేసింది.

నేను విన్నాను మీరు మిగిలిన రాజులకంటే ఈ భూలోకంలో ఉన్న ప్రజలకంటే ఎంతో తెలివైనవారని మీరు మీ తెలివికి కొన్ని పరీక్షలు పెట్టటానికి ఒప్పుకుంటారా.

ఆ పరీక్షలకి రాజుగారు ఒప్పుకున్నారు. అప్పుడు ఆ రాణి తను చేయగలిగినదాంట్లో కఠినమైన ప్రశ్నలు, చమత్కారమైన, అలాగే కష్టమైన పరీక్షలు పెట్టాలి అని అనుకుంది. ఆమె రాజుగారిని బాగా విసికించటం మొదలు పెట్టింది.

ఒకరోజు ఆ రాణి రాజుగారికి ఒక పెద్ద రత్నం ఇచ్చింది. దానికి మధ్యలో మెలితిరిగి ఉన్న ఒక రంధ్రం ఉంది. నువ్వు రంధ్రంలో నుంచి దారాన్ని పోనీయగలవా అని రాజుగారికి ఒక సవాలు విసిరింది. అప్పుడు ఆ రాజు ఒక పట్టుపురుగును ఆ రంధ్రంలోకి పోనిచ్చి త్రాడు తయారు చేయమన్నాడు. ఆ పట్టుపురుగుకి అదేమి అంత కష్టం కాదు. అది ఒక సన్నని దారం ఆ రంధ్రంలో తయారు చేసింది.

మరొకసారి ఆ రాణి అతనిని పరీక్షించటానికి ఒక గదిలో యాభైమంది అబ్బాయిలను అలాగే యాభైమంది అమ్మాయిలను ఉంచింది. వాళ్ళందరు ఒకే విధంగా తయా రయ్యారు. ఎలాగంటే ఎవరు అమ్మాయో ఎవరు అబ్బాయో గుర్తుపట్టలేనట్లు. చూడు నువ్వు వీళ్లలో నుంచి అబ్బాయిలను వేరు చేయి నేను నువ్వు జ్ఞానముగలవాడవని నమ్ము తాను అన్నది.

కాని ఆ రాజుకి తెలుసు అతని ఎలా చెప్పగలడో. అతను తన దగ్గర పనిచేసే వారిని పిలిచి ఇక్కడ ఉన్న ప్రతి ఒక్కరికి ఒక గిన్నెలో నీరు తీసుకొని వచ్చి, అక్కడ ఉన్న వారందరికి

ఇవ్వమన్నాడు. ఆ గదిలో ఉన్నవారందరు ఆ గిన్నెలను తీసుకొనిన తరువాత వాళ్ళందరిని ముఖం కడుకోమన్నాడు. అక్కడ ఉన్న అబ్బాయిలు అంత నీళ్ళను తుళ్లి మీద పడులాగా చేతులను నీళ్ళలో ముంచారు. కాని అమ్మాయిలు జాగ్రత్తగా వేళ్ళని నీళ్ళలో ముంచి ముఖం కడుకున్నారు. ఈ విధంగా రాజు ఎవరు అమ్మాయో ఎవరు అబ్బాయో చెప్పాడు.

ఆయన తెలివితేటలను చూసి రాణికి కోపం వచ్చింది. ఎలాగైనా ఈ రాజు వెర్రివాడు, జ్ఞానవంతుడు కాదు అని నిరూపించాలి అని దగ్గర ఉన్న సలహాదారులను అడిగింది.

అప్పుడు వాళ్ళకి ఒక ఆలోచన వచ్చింది. వాళ్ళు దానివల్ల కచ్చితంగా ఈసారి ఓడిపోరు. వాళ్ళు రాణితో మీరు కొంతమంది పనివారిని పిలిపించి వారిచేత ఒక తొంభై తొమ్మిది నకిలి పువ్వులను తయారుచేయించింది. అవి అచ్చం నిజమైనవిలాగా ఉండాలి. అవన్నీ తయారైన తరువాత రాణి కూడా చెప్పలేకపోయింది అవి నకిలి పువ్వులని. ఆ రాజు కూడ చెప్పలేడు అని అనుకుంది రాణి. ఆ రాజుగారి తోటలోనుండి ఒక పువ్వు తీసుకొని వాటిలో కలిపేసింది.

"రేపు ఒక అద్భుతమైన రోజు" అని రాణి అనుకుంది. ఎందుకంటే మనం ఆ తెలివైన రాజు వెర్రివాడిగా నిరూపించుబోతున్నాము. రేపు జరగబోయే ఆ విందులో రాజు గారిని అడుగుతాను ఇందులో ఏది నిజమైన పువ్వోనని.

తరువాత రోజు అందరు రాజుగారిని ఘనపరచడానికి ఆయన విందుకి రాజ్యంలోని ప్రజలందరు వచ్చారు. అక్కడ విందు అయిపోయిన తరువాత రాణి నుంచ్చోని మాట్లాడటం మొదలుపెట్టింది. అందరు ఆమె చెప్పేది శ్రద్ధగా వినటం మొదలుపెట్టారు.

అందరు వినండి నేను అందరికి ఒకటి చెప్పాలి. ఈ రోజు నేను రాజుగారికి ఒక ఆఖరి పరీక్ష పెడతాను. నా పనివారు చాలా అందమైన పూలను తయారుచేసారు. అవన్నీ చాలా నిజమైనవిగా ఉన్నాయి. అందులో తొంభైతొమ్మిది పువ్వులు నకిలివి ఒకటి మాత్రం నిజమైనది. రాజుగారు కనుక్కోగలడా నిజమైన పువ్వు ఏదో?


అప్పుడు ఆ రాజు ఆ రాణి ముందు వెర్రివాడు కాకుండా ఉండటానికి ఆ సవాలుని ఒప్పుకున్నాడు. అతను ఆ పువ్వులను వాసన చూసాడు అవన్నీ ఒకే విధంగా మంచి వాసన కలిగివున్నాయి. అన్ని పువ్వులు ఎంతో మృదువుగా ఉన్నాయి. అన్ని అందంగా కూడా ఉన్నాయి. మరి ఇప్పుడు ఏది నిజమైన పువ్వు అని ఎలా కనుక్కోవాలి అని రాజు ఆలోచించడం మొదలుపెట్టాడు. రాజు సంకోచించాడు. అప్పుడు ప్రజలంతా ఏంటిది మన రాజు అందరికంటే తెలివైనవాడు అలాగే గొప్ప వాడు కాదా? కచ్చితంగా ఆయన చెప్పగలడు నిజమైన పువ్వు ఏదో.

రాజు కొంచెం కలవరపడ్డాడు. ఇప్పుడు నేను ఏమి చేయాలి అని. అప్పుడు అతనికి ఒక శబ్దం వినిపించింది. ఎంటి అది అని చూస్తే అది ఆ తేనెటీగ ఒకప్పుడు అతను దానిని కాపాడాడు. నేను ఇక్కడున్నాను మీకు సహాయం చేయటానికి రాజుగారు. మీరు ఆ రోజు నా మీద చూపించిన దయకు నేను ఈ రోజు మీకోసం ఏదైన సహాయం చేయటానికి వచ్చాను.

అప్పుడు తేనెటీగ ఆ పువ్వుల దగ్గరకు ఎగురుకుంటు వెళ్ళి కొద్దిసేపటిలోనే ఏదైతే స్వచ్ఛమైన తేనెతో తీయగా ఉన్నదో కనుక్కుంది. వెంటనే రాజు ఆ పువ్వుని తీసుకొని రాణికి ఇచ్చి దానిని చూడమన్నాడు. ఆ పువ్వుని ఆ పనివారు చూచి అవును ఇదే నిజమైన పువ్వు అని చెప్పారు. చివరికి రాణి తన ఓటమిని అంగీకరించి ఈ రాజు నిజంగా అందరికంటే జ్ఞానముగలవాడని అంగీకరించింది.

అవును అతను నిజంగానే చాలా వివేకముగలవాడు. అతను ఎవరో కాదు దావీదు కుమారుడైన సొలొమోను. సొలొమోను ఎప్పుడైతే దేవుని ప్రార్థించి ధనంకి బదులుగా జ్ఞానమును అడుగుతాడో అప్పుడు యెహోవా దేవుడు ఈ విధంగా చెప్పాడు.........

"నీవు ఈలాగ అడిగినందుకు నీ మనవి ఆలకించుచున్నాను. బుద్ధి వివేకములు గల హృదయమును నీకిచ్చుచున్నాను. పూర్వికులలో నీవంటివాడు ఒకడును లేడు, ఇకమీదట నీవంటి వాడొకడును ఉండడు. మరియు నీవు ఘనతను ఇమన్నీ అడుగకపోయినను నేను వాటిని కూడా నీకిచ్చుచున్నాను. అందువలన నీ దినములన్నిటను రాజులలో నీవంటివాడు ఉండడు". (1 రాజులు 3:12-13).



# బైబిలు చరిత్ర

**సేకరణ:** రెవ.డా॥ కె.జోసఫ్

బైబిల్లో వివిధ సాహిత్య రీతులు వున్నాయి. కొన్ని పుస్తకాలు ఆద్యంతం ఒకే సాహిత్యశైలిలో వున్నాయి. వీటిలో ముఖ్యమైనవి : ఆజ్ఞలు, విధులు, చరిత్ర, పద్యం, కీర్తనలు, జ్ఞానసాహిత్యం, సామెతలు, సువార్తలు, పత్రికలు, దర్శన సాహిత్యం. కొన్ని పుస్తకాల్లో విభిన్న సాహిత్య శైలులు కన్పి స్తాయి. వీటిల్లో వర్ణన ప్రార్థన ఉపమానాలు ప్రవచనాలు (దేవోక్తులు) వంశావళులు ముఖ్యమైనవి.

**ఆజ్ఞలు, కట్టడలు, న్యాయవిధులు:** అనేక ప్రాచీన పశ్చి మాసియా సంస్కృతుల్లో ప్రతి సంస్కృతిలోనూ వేర్వేరుగా న్యాయవిధివిధానాలుండేవి (చట్టాలు). వీటిలో బబులోను అధిపతి హమ్మూరాబి (క్రీ.పూ. 1750-1792) ఆధ్వర్యంలో అమలులోనికి వచ్చిన శిక్షాస్మృతి బాగా ప్రసిద్ధి చెందింది. యూదు లేఖనాలలోని (పాత నిబంధన) మొదటి ఐదు గ్రంథాలను పంచగ్రంథాలు లేక పంచకాండాలు లేక ధర్మ శాస్త్రం (తోరా) అని పిలుస్తారు. ఈ గ్రంథాల్లో ధర్మవిధులతో బాటు మరెన్నో విషయాలు కూడ వున్నాయి. ఈ ధర్మవిధుల్లో నిషేధాజ్ఞలు (చేయకూడదు), అనుసరించదగిన ఆజ్ఞలు (చేయవలెను) వున్నాయి. ఇశ్రాయేలు ప్రజలు దేవుణ్ణి సరైన రీతిలో ఆరాధించడం ఒకరిపట్ల ఒకరు యథార్థంగా ప్రవర్తిం చడం ధర్మశాస్త్రం ముఖ్యోద్దేశం. బైబిల్లో ముఖ్యమైన ధర్మ విధులు 'పది ఆజ్ఞలు' (నిర్గమ 20:1-17, ద్వితీ 5:6-21). ఇతర ఉదాహరణలు : నిర్గమ 21:1-23:19, లేవీయ 1:1-7:36, సంఖ్యా 6:1-21, 35:16-34, ద్వితీ 14:3-17:7, యాకోబు 4:11,12.

**చరిత్ర:** పాత నిబంధనలోని చరిత్ర గ్రంథాలు ఇశ్రాయేలీయులు క్రీ.పూ. 1250లో కనాను దేశంలో స్థిరపడినప్పటి నుంచి క్రీ.పూ. 587లో యెరూషలేం పతనం వరకు గల చరిత్రను వివరిస్తాయి. ఈ గ్రంథాల్లో ప్రముఖ ప్రవక్తలైన ఏలీయా ఎలీషా జరిగించిన అద్భుతకార్యాలు ఇశ్రాయేలును యూదాను పరిపాలించిన రాజుల కార్యాలు (దావీదు సొలొమోనుతో సహా) కన్పిస్తాయి. క్రీ.పూ.931లో ఇశ్రాయేలు దేశం రెండుగా వేరైపోయిన తర్వాత జరిగిన సంఘటనల వివరాలు కూడ ఈ చరిత్ర గ్రంథాల్లో కన్పిస్తాయి. యెహోషువ, 1,2 రాజులు గ్రంథాలు పాతనిబంధనలోని చరిత్ర గ్రంథాలు. క్రొత్తనిబంధనలోని అపొస్తలుల కార్యములు ఆది క్రైస్తవసంఘచరిత్రను తెలియజేస్తుంది.

**పద్యం, కీర్తనలు:** విభిన్న రీతులున్న పెద్ద విభాగమిది. యోబు కీర్తనలు పరమగీతము గ్రంథాల్లో పద్యశైలి కన్పిస్తుంది. బైబిల్లో కొన్ని ప్రాచీన స్తుతిగీతాలు (కీర్తనలు) పద్యశైలిలో వున్నాయి. కీర్తనల్లో అధికభాగం ఆరాధనలో ఉపయోగపడినవే. కొన్ని కీర్తనలు వాస్తవానికి ప్రార్థనలే. ప్రవక్తల సందేశాలు కూడ కొన్ని చోట్ల పద్యశైలిలో వున్నాయి. హెబ్రీ పద్యాన్ని అనువదిం చడం అంత సులభం కాదు. మూలభాషలో ఉన్న శక్తివంత మైన అర్థాన్ని పరిభాషను అనువాదంలో ప్రతిబింబించడం మామూలు విషయం కాదు. ఒకే భావాన్ని రెండు సామ్యాలతో (పోలికలతో) వర్ణించడం హెబ్రీ పద్యం విశిష్టత. కీర్తన 22:9,10 వచనాలు ఈ వర్ణనకు చక్కని వుదాహరణ. పాత నిబంధనలోని మరి కొన్ని ఉదాహరణలు : నిర్గమ 15:1-18, యోబు 22:21-30, కీర్తన 23, యెషయా 5:1-7, యోనా 2:2-9. క్రొత్త నిబంధనలో కూడ పద్యశైలి కన్పిస్తుంది. లూకా

1:46–55, ఫిలిప్పీ 2:6–11, ప్రకటన 15:3,4 పద్యశైలికి చక్కని వుదాహరణ.

**జ్ఞానయుక్తమైన సూక్తులు, సామెతలు:** పాత నిబంధనలో మరో పెద్ద విభాగమిది. ఆరాధనా ప్రకరణంలో పద్యం కీర్తనలు కథ వంటి విభిన్న శైలులు కన్పిస్తాయి. లోకం గురించి దేవుని గురించి మనుషులు గతి గురించి వివేచన (ఇంగిత జ్ఞానం) కలిగించే సామెతలు సూక్తులు ఒక విశిష్టమైన శైలిలో వుంటాయి. జ్ఞానయుక్తమైన సామెతలు సూక్తులు సామెతలు గ్రంథంలోనే కాక బైబిలోని యితర గ్రంథాల్లో కూడ కన్పిస్తాయి. ప్రసంగి యోబు గ్రంథాల్లో తాత్వికధోరణితో బాటు జ్ఞానవంతమైన ఉపదేశాలు కూడ వున్నాయి. జ్ఞాన సాహిత్యంలో ఇశ్రాయేలు చరిత్ర వివరాలు కన్పించవు. అయితే, నైతికత గురించి మానవ జీవితంలోని కఠినమైన వాస్తవాల గురించి వివిధ సవాళ్లు ఈ గ్రంథాల్లో కన్పిస్తాయి. జ్ఞానసాహిత్యంలోని కొన్ని గ్రంథాలను అత్యంత జ్ఞాని ఇశ్రాయేలు రాజు సొలొమోను రచించినట్లు చెబుతుంటారు. బహుశా వీటిల్లో కొన్ని సొలొమోను మరణా నంతరం అతని పేరు మీద వ్రాసిన గౌరవార్థ రచనలై వుండవచ్చు. యిప్పటి వరకు ప్రస్తావించిన వాటితో బాటు కీర్తన 1, కీర్తన 37లను కూడ జ్ఞానసాహిత్యానికి చక్కని ఉదాహరణలుగా చెప్పవచ్చు. జ్ఞాన సాహిత్యం క్రొత్త నిబంధనలో కూడ ప్రముఖంగా కన్పిస్తుంది. పర్వత ప్రసంగం (మత్తయి 5–7 అధ్యాయాలు), యాకోబు 3:2–8, 4:13–17 వచనాలు క్రొత్త నిబంధనలోని జ్ఞానసాహిత్యానికి ఉదాహరణలు.

**సువార్తలు:** క్రొత్త నిబంధనలోని మత్తయి మార్కు లూకా యోహాను సువార్తలు యేసు జీవితం గురించి ఆయన బోధల గురించి వివరిస్తాయి. వీటిని సువార్తలు అని పిలుస్తారు. ఇవాంజెలియన్ అనే గ్రీకు పదానికి గాడ్‌స్పెల్ అనే ప్రాచీన ఆంగ్లపదం సూటి అయిన అనువాదం. గాడ్‌స్పెల్ అనే పదం నుంచి గాస్పెల్ అనే పదం వచ్చింది. గాస్పెల్ అంటే సువార్త అని అర్థం.

**పత్రికలు:** క్రొత్త నిబంధనలో అపొస్తలుడైన పౌలు యింకా యితరులు రాసిన పత్రికలు వున్నాయి. ఇవి క్రీస్తు శకం మొదటి శతాబ్దప గ్రీకు లేఖరచనాశైలిలో రాసిన పత్రికలు. రచయిత పరిచయం పత్రిక ప్రారంభంలో కన్పి స్తుంది (ఉదా: రోమా 1:1,2–7). ఆ తర్వాత, పత్రికను ఎవరికి వ్రాశారో వారి ప్రస్తావన, శుభవచనం కన్పిస్తాయి (ఉదా: రోమా 1:2–7). పత్రికలో ప్రధాన భాగం సందేశం (ఉదా: రోమా 1:16–15:35). పౌలు పత్రికల్లో చాలా వాటిల్లో శుభవచనం తర్వాత కృతజ్ఞతాపూర్వకమైన ప్రార్థన వుంటుంది (ఉదా: రోమా 1:8–15). అంతిమ శుభ వచనంతో ఆశీర్వాదంతో పత్రిక ముగుస్తుంది (ఉదా: రోమా 16:1–27). ప్రతి పత్రికలో ప్రార్థనలు ఉపదేశాలు బోధ జ్ఞానసాహిత్యం హెచ్చరికలు ఆరాధనాగీతాలు (లేక, కీర్తనలు) వ్యక్తిగత సమాచారం వంటి విభిన్నరీతులు కన్పిస్తాయి. క్రొత్త నిబంధనలో పత్రికలు విభాగంలో కన్పించే కొన్ని రచనలు క్రైస్తవులందరికి వర్తించే సాధారణాంశాలను ప్రధానంగా ప్రస్తావిస్తాయి. హెబ్రీ పత్రిక యిటువంటి సాధారణ పత్రిక. చిన్నా ఆసియాలోని ఏడు సంఘాలకు రాసిన క్లుప్త పత్రికలు ప్రకటన 2,3 అధ్యాయాల్లో వున్నాయి. క్రొత్త నిబంధనలో అపొస్తలుల కార్యములు ప్రకటన గ్రంథాల మధ్య పత్రికలు విభాగం కన్పిస్తుంది.

**దర్శన సాహిత్యం:** అపొకలిప్సిస్ అనే గ్రీకు పదం బయలుపరచు లేక తెరతీయు అనే అర్థాన్నిస్తుంది. ఈ సాహిత్యాన్ని కొన్నిసార్లు ప్రవచన సాహిత్యం అని కూడ పిలుస్తారు. ప్రవచనం లాగా దర్శన సాహిత్యం కూడ భవిష్యత్ కాలంలో జరగబోయే సంఘటనలను తెలియజేస్తుంది. అయితే, దర్శన సాహిత్యం విశిష్టత వేరు. ఉదా: దర్శన సాహిత్యం దేవుని నుంచి కలిగిన దర్శనాలను వివరిస్తుంది. నిగూఢమైన అర్థాలను స్ఫురింపచేసే మృగాలు రంగులు సంఖ్యలు మొదలైన సాదృశ్యాలు, యెహోవా దినము గురించి ప్రవచనాలు సాధారణంగా దర్శనసాహిత్యంలో ప్రాముఖ్యంగా వుంటాయి. దేవుని ప్రజలు అనుభవించిన గడ్డు పరిస్థితుల్లో వ్రాసిన రచనలే దర్శన సాహిత్యం. దేవునిపట్ల విశ్వాస్యత

చూపినవారికి ఆయన తోడుగా వుంచాడనే నిరీక్షణాస్పదమైన ఆశాభావం దర్శన సాహిత్యంలో ప్రధానంగా కన్పిస్తుంది. దానియేలు, ప్రకటన గ్రంథాలు దర్శనసాహిత్యానికి మచ్చు తునకలు.

## బైబిల్లోని వివిధ రచనాశైలులు

**గద్యం (వచనం):** వర్ణన వివరణ వచనంలో ప్రధానభాగాలు. వ్యక్తుల గురించి చరిత్ర గురించి వర్ణన వచనంలో కన్పిస్తుంది. వచనంలో సంభాషణ అనే మరో రచనాశైలి కూడ కన్పిస్తుంది. బైబిల్లో చాలా భాగం వచనంలో వుంటుంది. గద్యరచనలో కథ లేక ఇతివృత్తం ప్రముఖమైంది. కొన్ని ఇతివృత్తాలు క్లుప్తంగా కేవలం కొన్ని అధ్యాయాలకే పరిమితమై వుంటాయి. ఉదా: నోవహు (ఆది 6-10), యోసేపు (ఆది 37:1-47:26). మరికొన్ని గ్రంథాల్లో గ్రంథమంతటా ఒకే ఒక వృత్తాంతం వుంటుంది (ఉదా: రూత, ఎస్తేరు). సువార్తలు యేసు జీవితం గురించి ఆయన మరణపునరుత్థానాల గురించి వివరిస్తాయి. అయితే, సువార్తల్లో మరికొన్ని కథనాలు కూడ వున్నాయి. ఉదా: బాప్తిస్మమిచ్చు యోహాను (మత్తయి 3:1-17, 11:1-19, 14:1-12). అపొస్తలుల కార్యములు గ్రంథం పేతురు గురించి పౌలు గురించి యేసుక్రీస్తు సందేశాన్ని ప్రకటించిన యితర శిష్యుల గురించి తెలియజేస్తుంది.

**ప్రార్థనలు:** ప్రార్థనలు గద్యంలోనూ పద్యంలోనూ వుంటాయి. దేవునితో సంభాషించడమే ప్రార్థన. ఇదే ప్రార్థన విశిష్టత. కీర్తనలు గ్రంథంలో పద్యరూపంలో వున్న ప్రార్థనలు కన్పిస్తాయి. కొన్ని కీర్తనలు బహిరంగ ఆరాధనలో దేవుని సహాయాన్ని అర్థిస్తూ చేసిన ప్రార్థనలు (కీర్తన 79,80), మరి కొన్ని కీర్తనలు పంట కోత సమయంలో చెల్లించే కృతజ్ఞతా స్తుతులు (కీర్తన 126), మరి కొన్ని కీర్తనలు క్రొత్త రాజు అభిషేక కార్యక్రమానికి సంబంధించినవి (కీర్తన 21), కొన్ని కీర్తనలు విచారాన్ని వెలిబుచ్చుతూ సహాయాన్ని అర్థిస్తూ కృతజ్ఞతలు చెల్లిస్తూ క్షమాపణ కొరకు వేడుకుంటూ చేసిన వ్యక్తిగత ప్రార్థనలు (కీర్తన 12,51,120,138). ప్రార్థనలు బైబిలు అంతటా కన్పిస్తాయి (కొన్ని ఉదాహరణలు: ఆది 18:27,28; నిర్గమ 17:4; న్యాయాధి 5:2-31; 1 సమూ 2:1-10; 1 రాజులు 3:6-9; యోనా 2:2-9; లూకా 11:2-4; 22:42; యోహాను 17:1-26; రోమా 16:25-27; హెబ్రీ 13:21). అన్నిటి కంటె ముఖ్యమైంది యేసు శిష్యులకు నేర్పిన ప్రార్థన (మత్తయి 6:9-13).

**ప్రవచనాలు:** పాత నిబంధనలో మరో ప్రధానభాగం ప్రవచన సందేశాలు (లేక దేవోక్తులు). యెహోవా వాక్కు లేక యెహోవా ఈలాగు సెలవిచ్చుచున్నాడు అనే పదాలతో ప్రవచనాలు ప్రారంభమౌతాయి. అనగా, ప్రవక్త పలికే సందేశం ప్రవక్త స్వంత సందేశం కాదని దేవుని వద్ద నుంచి వచ్చిన సందేశాన్నే ప్రవక్త పలుకుతున్నాడని అర్థం. ప్రవచన సందేశాలు పలుచోట్ల హెబ్రీ పద్యశైలిలో వున్నాయి. పద్యంలో సాధారణంగా కనిపించే భాషాలంకారాలు (ముఖ్యంగా సామ్యం, లేక పోలిక) ప్రవచనాల్లో కూడ కన్పిస్తాయి. పాత నిబంధన గ్రంథంలోని ప్రవచన గ్రంథాలు ప్రవక్త గురించి అతని పరిచర్య గురించి (ప్రవక్తకు దేవునివద్ద నుంచి వచ్చిన సందేశాలను) తెలియజేస్తాయి. పాత నిబంధనలో వైవిధ్యభరితమైన ప్రవచనాలకు యెషయా 1:2-31; 10:24-27; యిర్మీయా 2; యెహెజ్కేలు 36:22-32; ఆమోసు 5:4-27; జెకర్యా 9:1-17 చక్కని ఉదాహరణలు. క్రొత్త నిబంధనలో కూడ ప్రవచన సందేశాలు కన్పిస్తాయి. బాప్తిస్మమిచ్చు యోహాను గురించి యేసు గురించి వున్న ప్రవచనాలు క్రొత్త నిబంధనలో ముఖ్యమైన ప్రవచనాలు (మత్తయి 3:1-12; 24:1-31). 2 పేతురు 3:8-13 కూడ చూడండి.

**ఉపమానాలు:** దేవుని గురించి ఆయన రాజ్యం గురించి ముఖ్యమైన సత్యాలను దైనందిన జీవితంలో అందరికి బాగా తెలిసిన విషయాలతో పోల్చి చెప్పే చిన్న కథలే ఉపమానాలు. యేసు ఉపమానాల ద్వారా దైవసత్యాలను బోధించినట్లు సువార్తలు తెలియజేస్తున్నాయి. ఉపమానాలు క్లుప్తంగానైనా (మత్తయి 13:44-48), లేక వివిధ పాత్రలతో లేక సాదృశ్యాలతో పెద్దవైనా కావచ్చు (లూకా 10:30-37; 15:11-32). ఉపమానాలు అన్న చిన్న వ్యాసం కూడ చూడండి.

**(సశేషం)**

ఉచితం! ఉచితం!! ఉచితం!!!

విద్యను అమ్ముతున్న కాలంలో విద్యాదానం చేస్తున్న

# I.E.R.F. మిషన్ విద్యా సంస్థలు

(ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వముచే గుర్తింపబడిన సంస్థ)

బీద బడుగు వర్గాల విద్యార్థినీ విద్యార్థులకు మరియు తల్లిదండ్రులకు గొప్ప సదవకాశం. త్వరపడండి. ఒంగోలు, క్లౌపేట, 6వ లైను, కృపాదానంగారి వీధిలో ఉన్న I.E.R.F. సంస్థ గత 40 సంవత్సరాలుగా పేద బడుగువర్గాల అభ్యున్నతి కొరకు విద్యారంగంలో ఎన్నో వినూత్న కార్యక్రమాలను చేపట్టి రెసిడెన్షియల్ స్కూల్‌తో సమానంగా విద్యను అందిస్తుంది. గత ఏడాది మా U.C.L.I. స్కూల్‌నందు 10వ తరగతిలో 90% ఉత్తీర్ణత. అంతమాత్రమే కాక ఈ సంస్థలో చదివిన వారికి దైవానుగ్రహం కూడా మెండుగా లభిస్తుందని చెప్పటానికి ఋజువు ఈ సంస్థలో చదివిన వారు అనేకులు విదేశాలలో (అమెరికాలో) ఉద్యోగం చేస్తూ ఉండటం గమనార్హం. ఈ విధంగా పేద బడుగు వర్గాల అభ్యున్నతిని సాధిస్తున్న I.E.R.F. సంస్థ గత 2 సంవత్సరాలుగా 1,2,3 తరగతులకు ఉచితముగా కాన్వెంట్ స్థాయిలో ఇంగ్లీషు బోధన మొదలుపెట్టింది. టీచర్స్ ఇంగ్లీషు మాతృభాష అయిన ఇంగ్లండు దేశపు వారు కావటం ఇంకొక ప్రత్యేకత. మా స్కూలునందు ఎలిమెంటరీ పిల్లలు సైతం ఇంగ్లీషు మాట్లాడము గమనార్హం.

## మా స్కూలు ప్రత్యేకతలు

H అన్ని తరగతుల విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం కలదు.
H విద్యార్థులకు ఉచిత మధ్యాహ్న భోజనం మరియు ఒక జత యూనిఫాం ఉచితంగా ఇవ్వబడును.
H విద్యార్థినీ విద్యార్థులకు వేరువేరుగా ఉచిత హాస్టల్ సౌకర్యం కలదు.
H కులమత సంబంధం లేదు ఎవరైనా మా హాస్టల్‌లో చేరవచ్చును.
H 1,2,3 తరగతులకు A/c Class Room సౌకర్యం కలదు.
H ఎలిమెంటరీ విద్యార్థులకు స్కాలర్‌షిప్ సదుపాయం మరియు ఫ్యామిలీ సపోర్టు కలదు.
H బాలికలకు ఉచితంగా G.N.M. నర్సింగ్, INTER శిక్షణ ఇప్పించబడును.
H B.Sc. నర్సింగ్ వారికి స్వల్ప ఫీజులతో శిక్షణ.
H 1 నుండి 10 వరకు అడ్మిషన్లు జరుగుచున్నవి. సీట్లు పరిమితం విచ్చేయండి.

సీట్లు పరిమితం కనుక ముందుగా సీటు రిజర్వ్ చేసుకొనవలెను.

మీ పిల్లల చక్కని భవిష్యత్ కొరకు ఉన్నత విద్యాబుద్ధుల కొరకు ఐ.ఈ.ఆర్.ఎఫ్. సంస్థలో చేర్పించండి.

ఇట్లు

**రెవ.డా॥ జోసఫ్ కొడవటికంటి**, కరస్పాండెంట్

సెల్ : 9676340371, 9704255416

1

# మధ్యకాలము

## (ప్రవక్తయైన మలాకీ కాలము నుండి బాప్తిస్మమిచ్చు యోహాను వరకు గల మధ్యకాలములోని యూదుల చరిత్ర)



బ్రదర్ కె.సామ్రాట్

**మధ్యకాలమనగా :** ప్రవక్త మలాకీ కాలము నుండి ప్రభువైన యేసుక్రీస్తువారి జీవిత ప్రారంభము వరకు వున్న యూదుల సమగ్ర చరిత్ర మరియు పాతనిబంధన క్రొత్త నిబంధన చరిత్రలను కలుపు సమయమిది. మనము ఊహించని కార్యములు, సంఘటనలు జరిగిన చారిత్రాత్మక సమయమే - ఈ "**మధ్యకాలము**".

పాతనిబంధన కాలములో ఏ విధముగా చూసినా మలాకీ చివరి ప్రవక్తగా పరిగణింపబడెను. సాధారణ లెక్క ప్రకారము క్రీ॥పూ॥ దాదాపు 409 సం॥లో అతడు ప్రవక్తగా నివశించెను. అతనితో సమకాలీనుడైన నెహెమ్యా ఆర్థిక మంత్రులలో చివరివాడైన అతని చివరి సంస్కరణ చట్టము క్రీ॥పూ॥ 409 సం॥లో ప్రిడియక్స్‌రాజు ద్వారా స్థిరపరచ బడెను. ఆ తరువాత 70 సం॥ల కంటే తక్కువ వయస్సులోనే అతను మరణించెను. అతని కాలములో యూదా ప్రభుత్వము, ఎజ్రా కాలములో అతడు నిర్వహించిన కార్యనిర్వాహణ, పాలన గురించి తెలుసుకొనుటకు ఎజ్రా, నెహెమ్యా, దాని యేలు గ్రంథముల వ్యాఖ్యానము ముందుగా చదువవలెను.

కల్దీయుల యొక్క చెరనుండి యూదులు తిరిగి వచ్చినప్పుడు వారిలో ఎక్కువ మంది క్రొత్త భార్యలను, మిశ్రమ జాతి సంతానమును వారితో తీసికొని వచ్చారు. వారు యెరూషలేములో ఉండుటకు నెహెమ్యా నిరాకరించాడు. గనుక వారు సమరయ ప్రాంతములలో స్థిరపడ్డారు. ఆ విధముగా దేశ బహిష్కరణ చేయబడిన వారిలో ప్రధాన యాజకుడైన యెహెదయ కుమారుడైన 'మనష్షె' ఒకడు. అతడు సమరయ దేశపు గవర్నర్ అయిన హోరోనీయుడైన సన్బల్లటు కుమార్తెను వివాహమాడి మామగారి భద్రతలో ఉండెను. నెహెమ్యా మరణించిన తరువాత సన్బట్లటు సమరయకు దగ్గరలో నున్న గెరాజీము పర్వతముపై ఒక దేవాలయము కట్టుటకు రాజైన దర్యావేషు నుండి అనుమతి పొంది అతని అల్లుడైన మనష్షేను ప్రధాన యాజకునిగా చేశాడు. క్రీ॥పూ॥ 408 సం॥లో ఆలయ నిర్మాణము ప్రారంభించాడు.

ఆలయము నిర్మింపబడిన తర్వాత, తరలి వచ్చిన యూదులందరికి ఈ ఆలయము ఆశ్రయపురమైనది. అందు వలన ఆ స్థలములో పూర్వకాలము నందుండిన మతపరమైన ఆచారములను త్రోసివేసి, ఇశ్రాయేలు దేవుడైన యెహోవాను మాత్రమే సేవించుటకు పునరుద్ధరింపబడెను. యెరూషలేము ప్రజలు సమరయులను కుల భ్రష్టులుగా భావించిరి. సమరయులు గెరాజీము పర్వతము ఒక్కటి మాత్రమే దేవునిని ఆరాధించుటకు సరైన స్థలముగా భావించిరి. ఆచారములను త్రోసివేసి, మోషే ద్వారా లిఖింపబడిన ఐదు పుస్తకములను (ఆదికాండము, నిర్గమ కాండము, లేవీయకాండము, సంఖ్యా కాండము, ద్వితీయోపదేశ కాండము) మాత్రమే పాటించుచుండిరి.

యూదా దేశపు గవర్నరు అయిన నెహెమ్యా మరణించిన తర్వాత క్రొత్త గవర్నరు వచ్చియుండెను. యూదా పట్టణము సిరియా పాలనలో ఉండెను మరియు తాత్కాలి కముగా పౌరసంబంధమైన, మతసంబంధమైన అధికారము లను ప్రధాన యాజకునికి ఇవ్వవలసినదిగా చట్టమందు వ్రాయబడెను. ఇందు మూలముగా ప్రధాన యాజకుని కార్యాలయము అన్యుల కార్యాలయముగా మారెను. అర్తహషస్త నీహస్ క్రీ॥పూ॥ 405లో తన తండ్రి అయిన దరియస్‌నోతస్ (క్రీ॥పూ॥ 423) పరిపాలన తర్వాత రాజాయెను. అర్తహషస్త నీహస్ పరిపాలించు చివరి దినములలో ప్రధాన యాజకుని

కార్యాలయము సిరియా మరియు ఫెనేషియా గవర్నరుల చేతికి ఇవ్వబడెను. బాగోసస్ అను గవర్నరు యెహోన్నాను అను ప్రధాన యాజకుని స్థానములో అతని సోదరుడైన యెహోషువాను దేవాలయ గర్భాలయములో చంపివేసెను. ఇతను క్రీ॥పూ॥ 366 సం॥లో గవర్నర్ ఆదేశం ప్రకారము బలాత్కారముగా ప్రధాన యాజకత్వము పొందెను. గనుక ఈ చెడు పరిణామాలు కలిగినవి.

బాగోగన్ ఈ మరణ వార్త విని కోపోద్రిక్తుడై యెరూషలేమునకు వచ్చి దేశముపై ఎక్కువ పన్ను విధించెను. ఈ పన్నుల భారము అతని పాలనంతటిలో దాదాపు ఏడు సంవత్సరములు ఉండెను.

అర్తహస్తసీహస్ క్రీ॥పూ॥ 359 సం॥లో తన కుమారుడైన ఓకస్ యొక్క మూర్ఖపు పనులను బట్టి దుఃఖపూరితుడై మరణించెను. ఓకస్ యొక్క పెద్దతమ్ముడు అరియాసిస్ విషము త్రాగి మరణించునట్లు చిన్నతమ్ముడు హర్పతేషు ఉరివేసుకొని మరణించునట్లు మూర్ఖముగా ప్రవర్తించెను. ఆ విధముగా ఓకస్ తన తండ్రి రాజ్యమును, అధికారమును స్వతంత్రించుకొనెను.

ఓకస్‌యొక్క పరిపాలన మూడవ సంవత్సరములో అనగా క్రీ॥పూ॥ 356 సం॥లో మసిదోనియాలోని 'పెల్లా' అను ప్రాంతములో అలగ్జాండర్ ది గ్రేట్ అను బాలుడు జన్మించాడు. ఓకస్ 21 సంవత్సరములు పరిపాలించిన తర్వాత తనకు ప్రియమైన గవర్నరు అయిన బగోయాస్ వలన విషము చేత చంపబడెను. రాజ్యము తనకు దక్కుతుందని, తన చిన్న కుమారుడైన ఆర్సస్ తలపై కిరీటము ఉంచవచ్చనే కుట్రతో బగోయాస్, ఓకస్‌ను హత్య చేశాడు. కాని తర్వాత తన చిన్న కుమారుడైన ఆర్సస్‌ని కూడా విషముతో చంపించాడు. నెహెమ్యా బంధువైన కొదోమానస్‌ని సింహాసనమును అధిష్ఠింప జేసెను. ఈ క్రొత్త రాజు దర్యావేషు అని తన పేరు మార్చుకున్నాడు. బగోయాస్ ఇతనికి కూడా విషపూరిత ద్రావకమునిచ్చి చంపాలని చూశాడు. కాని దర్వావేషు దానిని త్రాగుటకు నిరాకరించి తన ప్రాణమును కాపాడుకొని ఆ అపరాధిని శిక్షించెను.

క్రీ॥పూ॥ 336 సం॥లో అలెగ్జాండరు తండ్రియైన ఫిలిప్పు మాసిదోనియుడగు సైన్యాధ్యక్షుడైన పాసానియస్ వలన చంపబడ్డాడు. తన కుమారుడైన అలెగ్జాండరును మాసిదోనియా రాజుగా అభిషేకించెను. పర్షియా దేశముపైకి గ్రీకు దండయాత్ర జరిగింపక ముందు ఫిలిప్పు గ్రీసు దేశము యొక్క సమైఖ్య సైన్యమునకు అధ్యక్షునిగా ఉన్న సమయంలో తన కుమార్తెను ఎపిరస్ రాజైన అలెగ్జాండరుకు యిచ్చి వివాహం చేశాడు.

క్రొత్త ఎన్నికల ద్వారా కూడా అలెగ్జాండరు మాసిదోనియా రాజుగా ఎన్నుకోబడ్డాడు. ఒకే దండయాత్రలో ఆసియాలో ఉన్న చిన్న రాజులను ఓడించారు. రెండు పర్యాయములు యుద్ధములు చేసి దర్యావేషును అధికారము నుండి తొలగించి అతని తల్లి, భార్యా పిల్లలను చెరగొని పోయెను. అంతేకాక క్రీ॥పూ॥ 302లో సిరియా దేశమంతటిని, తూరు దేశమంతటిని దోచుకొనెను.

అలగ్జాండర్ తూరు పట్టణమును ముట్టడి వేయుచున్నపుడు గలలియ, సమరియ, యూదయ ప్రాంతములను తనకు లొంగిపొమ్మని ఆజ్ఞాపించెను. గలలియులు, సమరియులు అతనికి లొంగిపోయారు. కాని యూదయ దేశస్థులు దర్యావేషు యెడల తమకున్న భక్తి, విశ్వాసముల చేత అతనికి లోబడలేదు. అందువలన అలగ్జాండరు ఉగ్రత వారిమీద రగులుకున్నది. అతడు తూరు దేశపు సముద్రపు ఒడ్డు నుండి ఆ పట్టణము నిలబడియున్న ద్వీపము వరకు నేలమట్టము గావించెను. ఆ తర్వాత యూదుల మీద కక్ష సాధించుటకై యెరూషలేమునకు ప్రయాణించెను. అతని రాకడ విని, ప్రధాన యాజకుడైన జుద్దువా మరియు పట్టణస్తులందరు భయాక్రాంతులయ్యారు. వారికి ఇప్పుడు దేవుని కాపుదల తప్ప మరో దారిలేదు. వారు ఉపవాసముండి ప్రార్థించారు. దేవుడు ఒక దర్శనము ద్వారా ప్రధాన యాజకుని తన యాజక అంగీతో ప్రతి యాజకుని ఇంటివద్ద కలుసుకొని ఆ యాజకులును, ప్రధాన యాజకుడును పట్టణస్తులందరును తెల్లని అంగీలతో పట్టణము వెలుపల అలగ్జాండరును కలుసుకొనుటకు వెళ్ళమని ఆజ్ఞాపించాడు.

ఈ విధంగా ప్రధాన యాజకుడును, పట్టణస్తులందరును తన వైపు కదలివచ్చుట చూచి ఏ దేవునికైతే ప్రధాన యాజకుడు యాజకత్వము చేయుచున్నాడో ఆ దేవుని యెడల భక్తి గౌరవములు ప్రదర్శించుటకై సద్భక్తితో విశ్వసనీయమైన గౌరవాభిమానముతో అతని ముందర మోకరిల్లెను. అంతే కాకుండా మాసిదోనియాయందు దియోమిన్‌లో ప్రధాన యాజకుడు అతనికి కలలో కనిపించి పర్షియా వారిపై విజయము పొందుదువని కూడా చెప్పెను.

జుద్దువా అలెగ్జాండరును పట్టణములోనికి ఆహ్వానించి బలులు అర్పించి దానియేలు గ్రంథములో నున్న ప్రవచనములను పర్షియా సామ్రాజ్యము గ్రీకు రాజు చేత కూల్చివేయబడుటను గూర్చి అతనికి చూపించెను.

యెరూషలేమునందు తనకు ఇవ్వబడిన ఘన స్వాగతమునకై అలెగ్జాండరు ఎంతో సంతోషించి ఆయన తిరిగి వెళ్ళేటప్పుడు యూదా మతమును, సిద్ధాంతములను అంగీకరించెను. మరియు ఏడు సంవత్సరములకు ఒకసారి కట్టవలసిన పన్నును కూడా తొలగించెను. యూదులు సంతోషించి అనేకులు అతనిని ఆమోదించిరి.

అతను యెరూషలేము విడచి వెళ్ళుచుండగా ఒక సమరయుడు గొప్ప ఆడంబరముతో, అట్టహాసముతో ఆయనను ఎదుర్కొని వారి పట్టణమునకు ఆహ్వానించెను. కాని అలెగ్జాండరు వారి ఆహ్వానమును, కొన్ని ముఖ్య అవసరములకై వారు పెట్టుకున్న అర్జీలను కూడా తాను ఐగుప్తు నుండి మరల తిరిగి వచ్చు వరకు నిరాకరించెను. మరియు అతని అభిమాని సరియా, పాలస్తీనా దేశముల గవర్నరు అయిన ఆంద్రోమాఖస్‌ని కూడా వదలి వెళ్ళెను.

అంద్రోమాఖన్ కొద్దికాలము తర్వాత వాణిజ్య పరమైన విషయములో సమరయకు వచ్చెను. అలెగ్జాండరు జరిగించిన హింసాత్మక కృత్యములకు ప్రతీకారముగా సమరయులు ఆంద్రోమాఖస్‌ను కాల్చివేసిరి. కాని అలెగ్జాండరు ఆ విషయము వినినప్పుడు ఆ హత్య జరిగించుటలో పాల్పడిన వారికందరికి మరణ శిక్ష విధించెను మరియు మిగిలిన వారినందరిని సమరయ నుండి బహిష్కరించాడు. అక్కడ మాసిదోనీయులకు ఒక కాలనీ ఏర్పాటు చేసి మిగిలిన స్థలమును యూదులకు ఇచ్చెను.


పర్షియా దేశము నశించిన తర్వాత గ్రీసు దేశమునకు అలెగ్జాండరు ఏకఛత్రాధిపతి అయ్యాడు. ప్రపంచములోని ఎక్కువ భాగమును జయించుచూ బబులోనునకు వచ్చిన తర్వాత గొప్ప త్రాగుబోతుగా, తిండిబోతుగా మారి క్రీ॥పూ॥ 323 మరణించాడు.

అలెగ్జాండరు ఒక ధైర్యశాలి, ఉత్తమమైన ఆత్మ కలిగిన వాడని అనుకోకుండా ఉండలేము. కాని, విమర్శనాత్మక శక్తి కంటే త్వరగా మండిపడు స్వభావము కలిగి యుండేవాడు. అతని పనులు విజయవంతమైనా అవి కోపముతోను, రౌద్రముతోను చేసినవే. అతనిలో నున్న కొన్ని మంచి లక్షణములను ఎక్కువగా ఉన్న చెడు గుణములు కొట్టివేసినవి. వృథాతి శయము అతని ముఖ్య కోరిక. పూర్వము ఉన్న గ్రీకు దేశపు యుద్ధశూరుల చరిత్రలకు తగిన విధముగా అతని జీవితమును దిద్దుకున్నాడు. అతడు గాజా చుట్టూ తిరుగుట, భారతదేశము మీద దండయాత్ర చేయుట, సారేమేనియా మీదుగా త్రాగుచూ పయనించుట, జూపిటర్ కుమారునిగా పిలిపించుకొనుట ఇవన్ని అతని యొక్క అనవసరపు అతిశయాన్ని ధృడపరచుచున్నాయి. అతని చర్యలన్నీ పరిశీలించి చూస్తే రక్తము చిందించి ఏకాధిపత్యము కోరుకున్న వారివలే ఇతను కూడా ఆ కాలపు హంతకుడు అని పరిగణించ వచ్చును. ప్రపంచ శాంతి కొరకు, మానవ పరిరక్షణ కొరకు సరియైన న్యాయ సమ్మతమైన పోరాటము జరిగించి ఉంటే ఆ క్రియలన్నీ శ్లాఘించ వలసినవే. కాని మిగిలిన విషయాలలో విజయము కేవలము హత్యా, దొంగతనము కంటే తక్కువేమి కాదు. **(సశేషం)**

**ఇంటర్‌నెట్‌లో తెలుగు బైబిలు కొరకు దర్శించండి :**

**www.onlinetelugubible.net**

# పౌలు జీవితము మరియు మిషెనరీ సువార్త ప్రయాణములు




ప్రియ పరిశుద్ధత పాఠకులకు మన ప్రభువును రక్షకుడైన యేసుక్రీస్తు నామమున శుభాభివందనములు

ఈ సంచికలో బైబిల్‌లో తెలుపబడిన పౌలు జీవితము మరియు మిషెనరీ సువార్త ప్రయాణములు గూర్చి తెలుసుకుందాము, ఆత్మీయం మేళ్ళు పొందుదాము.

1. క్రీ.శ.30 యేసుక్రీస్తు మరణించుట మరియు పునరుత్థానము నొందుట మత్తయి 27,28 అధ్యాయములు

2. క్రీ.శ.30 యేసుక్రీస్తు ఆరోహణమగుట అపో.కార్య.1 అధ్యాయము

3. క్రీ.శ.30 పెంతెకొస్తు అపో.కార్య.2 అధ్యాయము

4. క్రీ.శ.34 – స్తెఫను హతసాక్షి మరణము అపో.కార్య. 6:8–7:60

5. క్రీ.శ.35 – సౌలు క్రీస్తును అంగీకరించుట, పౌలుగా మార్చబడుట. అపో.కార్య.9:1–7

6. క్రీ.శ.37 – పౌలు విశ్వాసిగా యెరూషలేమును అపో.కార్య.9:26–29, మొదటిసారిగా దర్శించుట. గలతీ 1:18

7. క్రీ.శ.40 – కొర్నేలీ (అన్యుడు) క్రీస్తును అంగీకరించుట  అపో.కార్య.10

8. క్రీ.శ.42 – అంతియొకయలో పౌలు, బర్నబాలు పరిచర్య చేయుట. అపో.కార్య.11:19–30

9. క్రీ.శ.44 – అపొస్తలుడైన యాకోబు హతసాక్షిగా మరణించుట. అపో.కార్య.12:1,2

10. క్రీ.శ. 47 – అపొస్తలుడైన పౌలు సువార్తికునిగా చేసిన మొదటి ప్రయాణము ప్రారంభమగుట. అపో.కార్య. 13:1–3

11. క్రీ.శ. 49 – పౌలు మొదటి సువార్త ప్రయాణము సమాప్తమగుట. అపో.కార్య.14:26

మొదటి ప్రయాణము : అపొస్తలుల కార్యములు 13,14 అధ్యాయములు

**1. సిరియాలో గల అంతియొకయ (13:1–3)**.

ఇచ్చట బోధకులుగా ఉన్న బర్నబా, సుమెయోను, లూకియ, మనయేను, సౌలు అను ఐదుగురు ప్రవక్తలు ప్రభువును సేవించుచు ఉపవాసము చేయుచుండగా పరిశుద్ధాత్మ – నేను బర్నబాను, సౌలును పిలచిన పనికొరకు వారిని నాకు ప్రత్యేకపరచుడని వారితో చెప్పెను. అంతట వారు ఉపవాసమునుండి ప్రార్ధనచేసి బర్నబాసు పౌలుల మీద చేతులుంచి వారిని పంపిరి. చూశారా ఉపవాస ప్రార్ధన ఎంత ప్రాముఖ్యమో!

**2. సెలూకయి ( అపొస్తలుల కార్యములు 13:4).**

కాబట్టి వీరు పరిశుద్ధాత్మ చేత పంపబడిన వారై సెలూకయకు వచ్చి అక్కడనుండి ఓడ యెక్కి కుప్రకు వెళ్ళిరి.

**3. సలమీ (13:5).** వీరు ఇచ్చట యూదుల సమాజ మందిరములో దేవుని వాక్యమును ప్రచురించిరి. యోహాను మార్కు వీరికి ఉపచారము చేసెను. మార్కు

అనగా జాన్ మార్క్, ఇతడు బర్నబాకి బంధువు.

**4. పాపు (13:6-12).**

పౌలును అతనితోకూడ ఉన్న వారును పాపు అను ఊరు చేరువరకు బోధించుచు వచ్చిరి. ఇచ్చట గారడీ వాడును, అబద్ధప్రవక్తయునైన బర్‌యేసు అను యూదుడు వీరి పరిచర్యను విమర్శించి వీరిని వ్యతిరేకించెను. అందుచే పౌలు ఇతనిని కొంతకాలముపాటు గ్రుడ్డి వానిగా చేసెను. జరిగిన దానిని చూచి సెర్గిపౌలు అను అధిపతి ఆశ్చర్యపడి విశ్వసించెను. సౌలు, పౌలుగా పిలువ బడుట ప్రారంభమయ్యెను.

**5. పంఫూలియాలోనున్న పెర్గే (13:13).**

ఇచ్చట యోహాను మార్కు, వీరిని విడిచిపెట్టి యెరూష లేముకు తిరిగి వెళ్ళెను.

**6. పిసిదియలోగల అంతియొకయి (13:14-52).**

వీరు ఇచ్చట యూదుల సమాజమందిరములలో రెండు విశ్రాంతి దినములు బోధించగా అనేకమంది విశ్వసించిరి. అయితే యూదులు వీరిని వ్యతిరేకించి హింస కలుగజేసి ఆ పట్టణమునుండి బలవంతముగా వెళ్ళగొట్టిరి. పౌలు యూదులను విడచి అన్య జనులకు సువార్తను బోధింప మొదలుపెట్టెను. చూశారా దేవుని చిత్తమును ఎవరు ఆపగలరు. హల్లెలూయా

**7. ఈకొనియ (14:1:5).**

పౌలు బర్నబా ఈకొనియకు వచ్చి పరిచర్య చేయుచు ఇచ్చట ''బహుకాలము'' గడిపిరి. కొంతకాలము తరువాత యూదులలోను అన్యజనులలోను కొందరు తమ అధికారులతో కలసి వీరిని అవమానపరచి రాళ్ళు రువ్వి చంపవలెనని ప్రయత్నించగా వారా సంగతి తెలుసుకొని లుకయోనియలోని లుస్త్రకు పారిపాయిరి.

**8. లుకయోనియలోని లుస్త్ర (14:6-30).**

ఇచ్చట పౌలు పుట్టినది మొదలుకొని కుంటివానిగా యున్న వ్యక్తిని స్వస్థపరచెను ఇది చూచిన లుస్త్ర ప్రజలు పౌలును, బర్నబాసు గ్రీకు దేవతయైన హెర్మే ద్యుపతియని ఆరాధించ ప్రయత్నించిరి. ఈకొనియనుండి వచ్చిన యూదులు లుస్త్రవారితో ఏకమై పౌలును చంపవలెనని రాళ్ళు రువ్వి అతనిని పట్టణము వెలుపలికి ఈడ్చుకొని వెలుపలికిపోయిరి. కొంత సమయమైన తరువాత పౌలు లేచి తిరిగి ఆ పట్టణమునకు వచ్చెను. మరునాడు వారు దెర్బేకు వెళ్ళిరి. శ్రమ అనుభవించుట విశ్వాసులకు తగి యున్నది.

**9. లుకయోనియలోని దెర్బే (అపొస్తలుల కార్యములు 14:20,21).**

వీరు ఈ పట్టణములో సువార్త ప్రకటించి అనేకులను శిష్యులనుగా చేసికొనిరి.

**10. లుస్త్ర (14:21-23).**

పౌలు మరియు బార్నబాసు మరియొకసారి ఈ పట్టణమునకు తిరిగివచ్చి శిష్యుల మనస్సులను ధృడపరచి, ఈ సంఘములో వారికి పెద్దలను ఏర్పరచిరి.

**11. ఈకొనియ (14:21-23).**

పౌలు మరియు బర్నబాసు మరియొకసారి ఈ పట్టణ మునకు తిరిగివచ్చి శిష్యుల మనస్సులను, ధృడపరచి, ఈ సంఘములో వారికి పెద్దలను ఏర్పరచిరి.

**12. పిసిదియలోగల అంతియొకయ (14:21-23).**

పౌలు మరియు బర్నబాసు మరియొకసారి ఈ పట్టణ మునకు తిరిగి వచ్చి శిష్యుల మనస్సులను ధృడపరచి ఈ సంఘములో వారికి పెద్దలను ఏర్పరచిరి.

**13. పెర్గే (14:24,25).**

ఇచ్చట పౌలు మరియు బర్నబాసు వాక్యమును బోధించి అత్తాలియకు దిగి వెళ్ళిరి.

### 14. అత్తాలియ (14:26)

ఇక్కడనుండి పౌలు మరియు బర్నబాసు ఓడయెక్కి తాము నెరవేర్చిన పని నిమిత్తము దేవుని కృపకు అప్ప గింపబడినవారైన మొదట బయలుదేరిన సిరియాలోని గల అంతియొకయకు తిరిగివచ్చిరి.

### 15. సిరియాలోగల అంతియొకయ (14:26:28).

ఇచ్చట వారు వచ్చి, సంఘమును సమకూర్చి, దేవుడు తమకు తోడై యుండి చేసిన కార్యములన్నియు, అన్య జనులు విశ్వసించుటకు ఆయన ద్వారము తెరచిన సంగ తియు వివరించి చెప్పి, అచ్చట శిష్యులయొద్ద "బహు కాలము" గడిపిరి.

గనుక నా ప్రియ సహోదరులారా ప్రభువు పరిచర్య నిమిత్తము ఆయన మీద ఆధారపడుట ఎంత ప్రాముఖ్యమో కదా! ప్రస్తుత దినాలలో దేవుని యొద్ద కనిపెట్టి సేవ చేయుట చాలా అరుదుగా చూస్తూ ఉంటాము. అందుకే మనకు దుఖం అవమానం. అపజయం కలుగుతూ ఉంటాయి.

జార్జి మ్యులర్ అనే మిషెనరీ ఈ విధంగా అన్నాడు "ప్రతిరోజు సేవకు ముందు దేవుని సన్నిధి ప్రాము ఖ్యము. దేవుని సన్నిధిలో నుండి సేవ బయలు వెళ్ళాలి. అలా దేవుని సన్నిధి లేని సేవ ఫలింపు ఉండదు". గనుక ప్రియ స్నేహితులారా మిషెనరీ పనిలో పూర్తిగా నిమఘ్నమై ప్రభువు సన్నిధి మరచిపోవద్దు. ఆత్మచే నడిపింపబడినప్పుడు అందులో ఫలము ఉంటుంది. అపొస్తలుడైన పౌలు తోటి సహోదరులతో కలసి చేసిన సేవ ఎంత ఫలింపో గదా! అపొస్తులకు ఉన్న ఒకే పని (ఎజెండా) అది ఆత్మచేత నడిపించబడటం. అందుకే అంటాను "దేవుని పనికొరకు ఆశ కలిగి ఉండు, ఆత్మ చేత నడిపింపబడు".

దేవుడు మిమ్ము దీవించుగాక!

## సంపాదకీయం తరువాయి....

ప్రత్యేకంగా మన పరచర్యల కోసం ప్రార్ధించండి. టి.వి. పరిచర్య కోసం, ఐ.ఈ.ఆర్.ఎఫ్‌లోని అన్నీ విభాగాలను ప్రభువు సన్నిధిలో జ్ఞాపకం చేసుకోండి. **"పరిశుద్ధత"** మాసపత్రికను మీ బంధువులు, స్నేహితులకు పరిచయం చేసి వారితో చందా కట్టించగలిగిన యెడల మీరు "పరిశుద్ధ గ్రంథము" బహుమతిగా పొందే అవకాశం వుంది. మీ పిల్లలను విరామ బైబిల్ పాఠశాలకు పంపండి. మీరు కూడా సువార్త సభలకు వెళ్ళి ఆత్మీయ మేలులు పొందండి. ఈ వేసవిలో దేవుడు నా మీద చాలా భారం పెట్టాడు. అనేక ప్రాంతాలలో సువార్త సభలు జరిగించాలి. నా కోసం, పరిచర్య కోసం ఎప్పటిలాగానే మీ ప్రార్ధనలలో జ్ఞాపకం చేసుకుంటారని ఆశిస్తున్నాను. దేవుడు మిమ్మును దీవించును గాక!



# పిలుపులు



శ్రీమతి రిబ్కా విక్రాంత్

ప్రియ పరిశుద్ధత పాఠకులకు మన ప్రభువును రక్షకుడైన యేసుక్రీస్తు నామమున శుభాభివందనములు.

ఈ సంచికలో పరిశుద్ధ గ్రంథమందు తెలుపబడిన పిలుపులు గూర్చి తెలుసుకుందాము.

1. **నోవహు**–ఓడను నిర్మించుటకొరకు పిలువబడెను తన కుటుంబాన్ని రక్షించుకొనెను. ఆదికాండము 6:14
2. **అబ్రాహాము**–తన దేశమును వదలి క్రొత్త ప్రదేశమునకు వెళ్ళుటకొరకు పిలువబడెను, దేవుని చిత్తమునకు లోబడెను. ఆదికాండము 12:1,2
3. **ఇస్సాకు**–పాలస్తీనాలో నివసించుట కొరకు మరియు అతని తండ్రియైన అబ్రహామువలె దేవుని కట్టడలను అనుసరించుటకొరకు. ఇస్సాకు అనగా "నవ్వు". ఆదికాండము 26:1-5
4. **యాకోబు** – తన తాతయైన అబ్రాహాము విశ్వాసము నిజమైనదని తెలియజేయుట కొరకు పిలువబడి దేవునికి లోబడెను. ఆదికాండము 28:12-15
5. **యోసేపు** – తన సహోదరుల మీద తన ఆత్మీయ ఆధిపత్యమును ప్రదర్శించుట కొరకు. యోసేపు అనగా ఫలించెడి కొమ్మ. ఆదికాండము 37:5-9
6. **మోషే**– ఐగుప్తు బానిసత్వము నుండి ఇశ్రాయేలీయులకు విడుదల కలిగించుటకొరకు. నిర్గమ 3:1-12
7. **అహరోను** – ఇశ్రాయేలీయుల మొట్టమొదటి ప్రధాన యాజకుడగుట కొరకు. లేవియకాండము 8:2
8. **ఎలియాజరు**–అహరోను తరువాత ప్రత్యక్షపు గుడార బాధ్యతలు నిర్వహించుటకు మరియు లేవీయుల ప్రధానయాజకుడగుట కొరకు. సంఖ్యా 3:22; 20:28;
9. **ఫిలేమోను**–తనకు తన సంతానమునకు దేవునిలో సమాధాన నిబంధన చేసికొనుటకు. సంఖ్యా.25:10-13
10. **యెహోషువ** – ఇశ్రాయేలీయులను కానాను దేశములోనికి నడపించుటకొరకు ఇతడు కాలేబు తమ్ముని కుమారుడు. యెహోషువ 1:1-9
11. **ఒత్నీయేలు** – కూషన్రిషాతాయమును (అరామ్నాహరాయిము రాజు) జయించుటకొరకు పిలువబడెను. న్యాయాధి 3:9-10
12. **ఏహూదు** – మోయాబీయులను జయించుట కొరకు పిలువబడెను. న్యాయాధిపతులు 3:15
13. **దెబోరా** మరియు బారాకు – కానానీయులను జయించుట కొరకు న్యాయాధిపతులు 4:4-9
14. **గిద్యోను** – మిద్యానీయులను జయించుట కొరకు న్యాయాధి 6:11-14
15. **యెఫ్తా** – అమ్మోనీయులను జయించుట కొరకు న్యాయాధిపతులు 11:29
16. **సమ్సోను** – ఫిలిష్తీయులను జయించుట కొరకు న్యాయాధి 13:24,25
17. **సమూయేలు** – ఏలీకి బదులుగా యాజకుడగుటకు కొరకు పిలువబడెను. 1సమూ.3:1-14
18. **సౌలు** – ఇశ్రాయేలీయుల మొట్టమొదటి రాజుగా అభిషేకింపబడుట కొరకు. 1సమూ.9 అధ్యా.
19. **దావీదు** – ఇశ్రాయేలీయుల అద్భుత్తమ రాజుగా అభిషేకింపబడుట కొరకు. 1సమూ.16 అధ్యా.
20. **సొలొమోను** – అతని తండ్రివలె దేవుని సేవించుట కొరకు పిలువబడెను. 1 రాజులు 3:1-14
21. **యరొబాము** – ఇశ్రాయేలు పదిగోత్రములకు రాజుగా నియమింపబడుటకొరకు. 1 రాజులు 11:26-40
22. **ఎలీషా** – ఏలీయా చేసిన సేవను పునఃస్థాపించుట కొరకు లేక ఏలీయా చేసిన సేవకంటే మించునట్టి

సేవ చేయుట కొరకు. 2 రాజులు 2:1-13

23. **ఏలీయా** - పాపమునకు వ్యతిరేకముగా తీర్పును ప్రకటించుట కొరకు. 1 రాజులు 17:1-4

24. **యెహూ** - ఇశ్రాయేలు పదిగోత్రముల వారిని పరిపాలించుట కొరకు. 2 రాజులు 9:1-6

25. **ఎజ్రా** - తిరిగి రాబడిన యూదులకు దేవుని వాక్యమును బోధించుట కొరకు. ఎజ్రా 7:6-10

26. **నెహెమ్యా** - యెరూషలేము చుట్టూ ప్రాకారమును నిర్మించుటకొరకు పిలువబడెను. నెహెమ్యా 2:18

27. **ఎస్తేరు** - తన ప్రజలను మరణమునుండి కాపాడుట కొరకు. ఎస్తేరు 4:13-16

28. **యెషయా** - దేవుని అత్యున్నతమైన ప్రవక్తగా నియమింపబడుట కొరకు. యెషయా 6:1-13

29. **యిర్మీయా** - జనమునకు ప్రవక్తగా నియమింపబడుట కొరకు పిలువబడెను. యిర్మీయా 1:4-10

30. **యెహెజ్కేలు** - ఇశ్రాయేలీయులకు కావలిగా నియమింపబడుట కొరకు. యెహెజ్కేలు 3:10-27

31. **దానియేలు**-కలల భావమును విశదపరచుట కొరకు పిలువబడెను. దానియేలు 2:19-23

32. **హోషేయ**-ఒక వ్యభిచారిని పెండ్లి చేసికొనుట కొరకు. ఇశ్రాయేలు వారికి దేవుని తీర్పు ప్రకటన చేయుటకు. హోషేయ 1:1,2.

33. **ఆమోసు** - ఇశ్రాయేలు పదిగోత్రముల వారు చేసిన పాపములకు వ్యతిరేకముగా బోధించుటకొరకు పిలువబడెను. ఆమోసు 1:1.

34. **యోనా** - నినెవె పట్టణస్థులు తమ దోషములకు పశ్చాత్తాపపడనిచో వారికి దుర్గతి కలుగునని ప్రకటించుట కొరకు. యోనా 1:1,2

35. **బాప్తిస్మమిచ్చు యోహాను** - ప్రభువైన క్రీస్తుకు మార్గము సిద్ధపరచుట కొరకు. లూకా 1:76-80

36. **పేతురు మరియు అంద్రెయ** - క్రీస్తును వెంబడించుట కొరకు. మత్తయి 4:18-20

37. **యాకోబు మరియు యోహాను** - క్రీస్తును వెంబడించుట కొరకు. మత్తయి 4:21,22

38. **ఫిలిప్పు**-క్రీస్తును వెంబడించుట కొరకు. యోహా. 1:43

**ముగింపు :** ప్రియ సహోదరి, సహోదరుడా మరి నీ విషయము ఏమిటి. నీ పిలుపు ఏమిటో నీకు తెలుసా. ప్రభువుని ఏనాడైనా అడిగావా? వాక్యము సెలవిస్తుంది. దేవుడు కొందరిని "అపొస్తలులుగా, కొందరిని ప్రవక్త లుగా, కొందరిని సువార్తికులుగా, కొందరిని కాపరులుగా మరికొందరిని బోధకులుగా (ఉపయోగకులుగా) పిలిచాడని. మన వ్యక్తిగత జీవితంలో దేవుని పిలుపు మనపట్ల ఏమై ఉంటుందని గుర్తెరగడం చాలా ఆశీర్వాదకరం. పిలుపుకు తగిన జీవితం జీవించుట, పిలుపులో ముందుకు వెళ్ళుట మనకు దీవెన. పిలుపును నిర్లక్ష్యం చేయవద్దు. దేవుని పరిచర్యకు నీ తలాంతులు ఉపయోగించు.

ప్రభువు కృప మనకు తోడై నడిపించును గాక!

## పాఠకులకు గమనిక

**'పరిశుద్ధత'** మాసపత్రికను మీరు ఎంతగానో ఆదరిస్తున్నందుకు మీకు మా కృతజ్ఞతలు. పత్రిక కావాలని అనేకమంది ఉత్తరాల ద్వారా, ఫోన్స్ ద్వారా అడుగుతున్నారు. "మీ పత్రిక ఫలానా చోట చూశాము. మీ పత్రిక చాలా బాగుందండీ, మా ఆధ్యాత్మిక జీవితానికి ఎంతో మేలుకరంగా ఉంది. దయచేసి మాకు కూడా పంపండి. మేము చందా కడతాము" అని అడుగుతున్నారు. అలా అడిగిన వాళ్ళందరికీ పంపాలంటే ఇప్పుడు చందా కట్టకుండా ఉచితంగా పత్రిక పొందుతున్న వాళ్ళందరికీ ఆపాలి. అందుకనే గత నెలలో పత్రికతో పాటు "పత్రిక కావాలా? వద్దా?" అనే విషయం పోస్ట్‌కార్డ్ ద్వారా తెలియజేయమని పోస్ట్‌కార్డ్ పంపించాము. అందువలన పోస్ట్‌కార్డ్ తిరిగి మాకు పంపని వాళ్ళందరికీ వరుసక్రమంలో పత్రిక ఆపివేయబడుతుంది. పత్రిక కావలసిన వాళ్ళు ఫోన్‌ద్వారా కాని, పోస్ట్‌కార్డ్ ద్వారా కాని తెలియజేయగలరు. నేటి పరిస్థితులలో పత్రిక నిర్వహణ చాలా వ్యయప్రయాసలతో కూడుకొని ఉన్నప్పటికీ, కేవలం విశ్వాసము ద్వారానే ఈ పత్రిక నిర్వహించగలుగు తున్నాము. అయితే పాఠకులు చందా కట్టడం తమ బాధ్యతగా గుర్తించాలి. ఎందుకంటే మీరు చందా కట్టటం వలన ఇంకా అనేకమందికి పత్రిక పంపడానికి సాధ్యమవుతుంది. సంవత్సరమంతటికీ కలిపి కేవలం 150/- రూపాయలు అన్నది ఎన్నతగినది కాదు. కావున పాఠకులు సహృదయముతో ఆలోచించి చందా కట్టవలసినగా ప్రభువు పేరట వేడుకొనుచున్నాను. **- ఎడిటర్**




## బహుమతి గెలవండి!

**'పరిశుద్ధత'** మాసపత్రికను ఇతరులకు పరిచయం చేసి వారిని చందాదారులుగా చేర్పించినట్లయితే మీారు **"పరిశుద్ధ గ్రంథమును"** బహుమతిగా పొందే సదవకాశం లభిస్తుంది. ఈ అవకాశం కేవలం చందాదారులకు మాత్రమే వర్తిస్తుంది. ఐదుగురు చందాదారులను చేర్పించిన వారికి రూ. 200/- విలువ చేసే బైబిలు ఉచితంగా ఇవ్వబడుతుంది. ఒక్కొక్కరికి రూ. 150/- చొప్పున ఐదుగురి చందా రూ. 750/- లు మాకు చేరిన వెంటనే చేర్పించిన వ్యక్తి అడ్రసుకు బైబిలు పంపబడుతుంది. చందా పంపదలచిన వారు మనియార్డరు ద్వారా మాకు డబ్బు పంపవలెను.

పాఠకులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని మీా స్నేహితులు, బంధువులను చందాదారులుగా చేర్పించి **"పరిశుద్ధ గ్రంథమును"** మీా సొంతం చేసుకోండి. పూర్తి వివరాల కొరకు మాకు ఫోన్ చేయండి.

## పునరుత్థాన పండుగ స్పెషల్ బైబిల్ క్విజ్ - జవాబులు

1. మాంసము, రక్తము
2. ఇస్కరియోతు యూదా
3. గెత్సేమనే
4. పేతురుతో
5. రెండుమారులు (మార్కు 14:30)
6. ప్రధానయాజకుని దాసుని (మల్కు)
7. అధిపతియైన పిలాతు యొద్దకు
8. పిలాతు భార్య
9. జనసమూహమును
10. బరబ్బాను
11. కపాలస్థలము
12. కురేనీయుడైన సీమోనును
13. బోళము
14. యోహాను గూర్చి
15. నా దేవా నా దేవా నన్నెందుకు చేయి విడచితివి
16. మూడు గంటలు
17. అరిమతయి యోసేపు
18. మగ్ధలేనె మరియ, వేరొక మరియ
19. గలిలయ
20. ఎమ్మాయి
21. వారి అపనమ్మిక, హృదయ కాఠిన్యము నిమిత్తము
22. తోమా
23. లేఖనములు
24. బేతనీయ
25. తన శిష్యులతో

**గత నెల విజేతలు :**

పి. దేవదాసు

దొర్నాల, ప్రకాశం జిల్లా



# అక్షరయజ్ఞం



## బైబిల్ క్విజ్ - 8

శ్రీమతి కె. ప్రసన్న పరాక్రమ్

1. ధాన్యము కొనడానికి ఐగుప్తు వచ్చిన అన్నలతో యోసేపు ఏమని కఠినముగా మాట్లాడెను?
2. అన్నలతో పాటు ఐగుప్తు దేశమునకు రాని యోసేపు సహోదరుడు ఎవరు?
3. ఏ సహోదరుడిని యోసేపు బంధించెను?
4. యోసేపు తన సహోదరులతో మాట్లాడునప్పుడు వారి మధ్య ఎవరు ఉండెను?
5. బెన్యామీను గోనెలోని ధాన్యములో ఏమి దాచియుంచెను?
6. యాకోబు ఐగుప్తు దేశము వెళ్ళుటకు ఎక్కడ నుండి బయలుదేరెను?
7. యాకోబుతో పాటు ఐగుప్తు దేశము వచ్చిన వారు ఎంతమంది?
8. వారు వచ్చి ఐగుప్తు దేశములోని ఏ ప్రదేశమందు కాపురముండిరి?
9. యాకోబు ఫరో ఎదుట నిలబడినప్పుడు ఆయన వయస్సెంత?
10. ఐగుప్తీయులకు ధాన్యము అమ్మకము చేసినప్పుడు ఎవరి భూములను యోసేపు కొనలేదు?
11. ఏ ఉద్యోగస్థుని ఉద్యోగము మరల ఇప్పించబడెను?
12. యోసేపు చేసిన ఉపకారమును పానదాయకుడు ఎన్ని సంవత్సరములు మరచిపోయెను?
13. ఫరో ఎన్ని కలలు కనెను?
14. ఫరో కలలో కనిపించిన జంతువులు ఏవి? ఎన్ని జంతువులు కనిపించాయి?
15. ఫరో కనిన రెండవ కలలో ఏమి కనబడెను?
16. కలల భావము చెప్పినందుకుగాను ప్రతిగా ఫరో యోసేపుకు ఏమి చేసెను?
17. ఫరో యోసేపుకు ఏమని పేరు పెట్టను?
18. యోసేపు భార్య పేరేమి?
19. యోసేపు మామ పేరేమి?
20. యోసేపు పెద్ద కుమారుని పేరేమి?
21. యోసేపు చిన్న కుమారుని పేరేమి?
22. ఐగుప్తు దేశములో ఎన్ని సంవత్సరములు కరవు వచ్చెను?
23. ఫరో ఎదుట నిలిచినప్పుడు యోసేపు వయస్సెంత?
24. యోసేపు మామ ఏ దేవాలయమునకు యాజకుడు?
25. ఐగుప్తులో ధాన్యము కొనుటకు బయలుదేరిన యోసేపు అన్నలు ఎంతమంది?

**గమనిక :** ఈ ప్రశ్నలన్నిటికి సమాధానాలు బైబిలు నుండి గ్రహించవచ్చును. మీరు ఈ బైబిల్ క్విజ్‌లో పాల్గొనటం ద్వారా బైబిలు జ్ఞానమును సంపాదించాలన్నదే మా ఉద్దేశ్యం. కావున ప్రతి ఒక్కరూ ఈ బైబిల్ క్విజ్‌లో పాల్గొని బైబిలు జ్ఞానము సంపాదించటంతో పాటు బహుమతులు గెలుపొందవలసినదిగా కోరుచున్నాము.